ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శుక్రవారం | 14-08- 2026 సంపుటి: 17, సంచిక: 132, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



### బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు

# 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు'

**119 నియోజకవర్గాల్లో 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం**

**ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**100 శాతం సబ్సిడీపై ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు**

**బీసీ మహిళల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి ఆర్థిక వృద్ధి సాధించడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాకలం) :
బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో లాంఛనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి, వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**1.19 లక్షల మహిళలకు ప్రయోజనం**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# మైనారిటీలకు ప్రాధాన్యం

## మైనారిటీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం

### 4 శాతం రిజర్వేషన్లకు రక్షణ : సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ రైజింగ్ కోసం కొత్తగా నియమితులైన ఉద్యోగులు కృషి చేయాలి**

**చదువుతో పాటు స్కిల్స్‌పై దృష్టి సారించాలి**

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాకలం) :
హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, రెండు వర్గాల వారు తనకు రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధి, ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో కొత్తగా నియమితులైన యువత తెలంగాణ రైజింగ్ లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 తదితర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 782 మంది మైనారిటీ అభ్యర్థులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు.

**చదువుతో పాటు నైపుణ్యాలు...** చదువే మన భవిష్యత్తును మార్చే ప్రధాన సాధనమని ముఖ్యమంత్రి అన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించిన తర్వాత యువత తమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్హతలతో పాటు నైపుణ్యాలు ఉన్న వారికి




దేశంలోనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ అనేక ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యువతను భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటే యువత జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకురావచ్చన్నారు.

తరువాయి 2వ పేజీలో...

### అర్హులైన ప్రతి ఒక్కరికీ

# నూతన పెన్షన్లు అందిస్తాం

**ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి : రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి**

**అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటాం**

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం)
అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నూతన రేషన్ కార్డులు, నూతన పెన్షన్ల పంపిణీ పై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నో రోజులుగా నూతన పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన



లబ్ధిదారులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, తలసేమియా బాధితులు తదితర అర్హులైన వర్గాలకు నూతన పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరూ ఆగస్టు 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

తరువాయి 2వ పేజీలో...

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు - ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ**




పెద్దపల్లి,ఆగస్టు13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా, యువత భవిష్యత్తు కోసం విద్యా,ఉపాధి రంగాల్లో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అపూర్వ సంస్కరణలు తీసుకు వస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు స్పష్టం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

తరువాయి 2వ పేజీలో...

### వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే

# బోనాలు ఎత్తిస్తాం

**ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు**

**గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఇల్లు ఇస్తోంది**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాకలం) :
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే



తరువాయి 2వ పేజీలో...



తెలంగాణ రాష్ట్ర రహదారులకు

## జాతీయ హోదా పురోగతి తెలపండి?

ఎన్‌హెచ్ హోదాకు కేంద్రం ప్రాతిపదికలేంటి?
రాష్ట్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలెన్ని?
జిల్లాలవారీగా వాటి పరిస్థితి ఏంటి

3



పెన్షన్లు, కల్యాణలక్ష్మి పథకాలపై కాంగ్రెస్

# ప్రభుత్వ నిర్లక్ష్యం

**- వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు..**
**- ఆడబిడ్డలకు రూ.2,500 వెంటనే అమలు చేయాలి - మాజీ జీవన్‌రెడ్డి**

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం)
నిరుపేద వర్గాలకు సామాజిక భద్రత కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్

తరువాయి 2వ పేజీలో...

### గ్రామీణ ప్రాంతాల సమగ్ర

# అభివృద్ధే ధ్యేయం

- రూ. 179 కోట్లతో నియోజకవర్గంలో భారీ అభివృద్ధి పనులు
- మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా 17న శంకుస్థాపనలు
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు

పెద్దపల్లి,ఆగస్టు13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని పెద్దపల్లి శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు స్పష్టం చేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జఫర్ ఖాన్ పేటలో గురువారం రూ. 5.43 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మద్దెల వాగు హై లెవెల్ బ్రిడ్జిని, గోదావరిఖని-జఫర్ ఖాన్ పేట-పెద్దపల్లి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును





ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో రూ. 15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు,పాఠశాల పునర్నిర్మాణ పనులను ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ గతంలో

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్



# మైనారిటీలకు ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి...

చిన్నచిన్న కుటుంబాల నుంచి వచ్చిన అనేక మంది యువత ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, వారి విజ యాలు అభినందనీయమని ముఖ్యమంత్రి పే ర్కొన్నారు. కష్టపడి సాధించిన ఈ అవకాశాలను ప్రజాసేవకు వినియోగించాలని సూచించారు.

**మైనారిటీలకు ప్రాధాన్యం**

ప్రజా ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు గతంలో అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి సఫలం కాలేదన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా మైనారిటీ వర్గాలకు గణనీయమైన ప్రయోజనం లభిస్తోందని చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా కూడా మైనారిటీ కుటుంబాలు పెద్ద సంఖ్యలో లబ్ధి పొందుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి తదితర రంగాల్లో మైనారిటీ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన**

గత ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 సహా అనేక ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరగలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. గ్రూప్-1 పరీక్షకు ఒకసారి ప్రయత్నం జరిగినప్పటికీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం కారణంగా అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గ్రూప్-1, గ్రూప్-2 వంటి కీలక పోస్టులకు సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయాలంటే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత, అనుభవం కలిగిన నిపుణులు సభ్యులుగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌తో పాటు పలువురు నిపుణులతో సంప్రదింపులు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశామని తెలిపారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

**న్యాయపోరాటం తర్వాత నియామకాలు**

రాష్ట్రంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు, ఉద్యోగ నియామకాలను అడ్డుకునేందుకు అనేక ఆటంకాలు సృష్టించారని ముఖ్యమంత్రి అన్నారు. అభ్యర్థులను తమ కుటుంబ సభ్యులుగా భావించి ప్రభుత్వం వారికి అండగా నిలిచిందన్నారు. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు సమర్థులైన న్యాయవాదులను నియమించి న్యాయ పోరాటం నిర్వహించామని, చివరకు ఉద్యోగ నియామకాలను పూర్తి చేయగలిగామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువత తమ వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు రాష్ట్ర భవిష్యత్తును కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

తెలంగాణను అభివృద్ధి చెందిన, నైపుణ్యాల ఆధారిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు మహ మ్మద్ ఫహీముద్దీన్ ఖురేషితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు

# ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’



మొదటి పేజీ తరువాయి...

ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు.

ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు.

మొదటి దశలో 1.19 లక్షల మందికి అవకాశం

కుట్టు మిషన్లు కోరుకునే మహిళల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, మొదటి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామని మంత్రి చెప్పారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువ మంది బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

**మహిళల ఉపాధికి ప్రభుత్వం అండ**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అదే విధంగా ‘ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు’ పథకం ద్వారా బీసీ మహిళలకు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ, వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీన వర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు. పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి ఈనెల 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్‌గా నిలుస్తోందని, మహాత్మా జ్యోతిబాపూలేను స్మరించుకుంటూ ప్రగతి భవన్‌ను “మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్” గా, సచివాలయాన్ని “డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం”’గా పేరు మార్చినట్లు తెలిపారు. అలాగే ఈనెల 18వ తేదీన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికీ

# నూతన పెన్షన్లు అందిస్తాం

మొదటి పేజీ తరువాయి...

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నూతన పెన్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 2,18,002 మంది లబ్ధిదారులకు ప్రతి నెల సుమారు రూ.47 కోట్ల మేర పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం అందుతున్న పెన్షన్లకు అదనంగా నూతన పెన్షన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్త స్థాయిలో పెన్షన్లు అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గీత కార్మికులు, చేనేత కార్మికులకు 50 సంవత్సరాల వయస్సు నుంచే పెన్షన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని, దివ్యాంగులకు 51 శాతం వైకల్యం నిబంధన ప్రకారం పెన్షన్ అందిస్తామని మంత్రి తెలిపారు. నూతన పెన్షన్లతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతున్నప్పటికీ ప్రజా సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నూతన పెన్షన్లకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో కొత్త పెన్షన్ల కోసం అనేక మంది ప్రజలు తమకు విజ్ఞప్తులు చేశారని, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రతి లబ్ధిదారునికి రూ.5 లక్షలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, సామాజిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకే చోట నాణ్యమైన విద్యను అభ్యసించేలా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,000 కోట్ల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందని మంత్రి తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన బిల్లులను ప్రతి నెలా గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సాగునీటి అంశంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇటీవల సమీక్ష నిర్వహించారని మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్రంలో సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో వెలుమ కార్పొరేషన్ చైర్పర్సన్ జువ్వాడ నరసింహారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేశ్, అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్, డి ఆర్ డి ఓ రఘువరన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

మొదటి పేజీ తరువాయి...

కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్‌తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు.

ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని, అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు.

గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు.

ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

# గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయం

మొదటి పేజీ తరువాయి...

రవాణా లేక, పాఠశాలలు శిథిలావస్థలో ఉండి ప్రజలు పడిన నరకాన్ని తొలిగిస్తూ, అప్రోచ్ రోడ్లకు మరో కోటి రూపాయలు వెచ్చించి రవాణా కష్టాలను పూర్తిగా తీర్చామని, గ్రామ వీధులన్నింటికీ సీసీ రోడ్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో రవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు రూ. 32 కోట్లతో ముత్తారం-మంథని డబుల్ రోడ్డు, రూ. 100 కోట్లతో పెద్దపల్లి-గర్రెపల్లి రోడ్డు, రూ.47 కోట్లు సుల్తానాబాద్-పెద్దపూర్ రోడ్డు కోసం నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఈ అభివృద్ధి పనులన్నింటికీ ఆగస్టు 17న సుల్తానాబాద్‌లో రాష్ట్ర ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు జరగనున్నందున ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులకు ఒరిగిందేమీ లేదని విమర్శించిన ఆయన, సమృద్ధిగా కురిసిన వర్షాలతో చెరువులు మత్తళ్లు దుకుతున్నాయని, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంతో చివరి ఆయకట్టుకూ సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గజానావేనా సదయ్య, సర్పంచ్ యాదగిరి జ్యోషన్న శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా 500 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాతో తిరంగా ర్యాలీ సాగింది. ఈ ర్యాలీకి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థిని విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని, దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలో కదిలిన 500 మీటర్ల పొడవైన తిరంగా జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమైక్యతను చాటేలా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావాలను మరింతగా పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, యువత, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలు, యూనివర్సిటీలను విస్తరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ర్యాలీ ముగింపు సందర్భంగా అందరూ కలిసి జాతీయ గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవ రెడ్డి, గోమాస శ్రీనివాస్, గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, కందుల సంధ్యారాణి, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థినీ విద్యార్థులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షన్లు, కల్యాణలక్ష్మి పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

దావా వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రూ.200 గా ఉన్న ఆసరా పెన్షన్‌ను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పదింతలు పెంచి రూ.2,000 చేశారని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని, ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 32 నెలలు గడిచినా ఆ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న ఏడు రకాల పెన్షన్లలో వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రూ. 2,000 పెన్షన్ అందించారని గుర్తుచేశారు. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి అండగా ఉండేందుకు కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్షకు ఆర్థిక సాయం పెంచిందన్నారు. కుల, మతాలకు అతీతంగా ఈ పథకాలను అమలు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మికి అదనంగా తులం బంగారం ఇస్తామని, మహిళలకు రూ.2,500 అందిస్తామని హామీ ఇచ్చి ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించిందని విమర్శించారు. వృద్ధుల పోషణను నిర్లక్ష్యం చేస్తే శిక్షించేలా చట్టాలు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే వృద్ధుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. పెన్షన్ల అమలుపై చట్టబద్ధతను ప్రశ్నించిన సందర్భంలో ప్రభుత్వం కనీసం కోర్టులో కౌంటర్ పిటిషన్ కూడా దాఖలు చేయకపోవడం దాని నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. దశాబ్ద కాలంగా అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ పథకాల ద్వారా కేసీఆర్‌ను ప్రజలు ప్రతి ఇంటి మేనమామగా భావించారని పేర్కొన్నారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరుకు చెంపపెట్టు వంటివని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మహిళలు, వృద్ధుల సంక్షేమం పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. సంక్షేమ పథకాల వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందనే ఉద్దేశంతోనే వాటిని తగ్గించే కుట్రలో భాగంగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వృద్ధాప్య పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్, ఆడబిడ్డలకు రూ.2,500 హామీని తక్షణమే అమలు చేయాలని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నైతికత ఉంటే బాధ్యత వహించి రాజీనామా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో శీలం ప్రవీణ్‌కుమార్, వొల్లం మల్లేశం, గాజుల రాజేందర్, మున్నా, కళ్లేపల్లె దుర్గయ్య, కోరుకంటి రాము, తోట హరీశ్, సతీష్ కుమార్, పల్లె రవి, రాధాకిషన్, గంగారెడ్డి, పొనగంటి మహేష్, రమేష్ బాబు, బర్కం మల్లేశం, నరేష్ గౌడ్, కచ్చు హరీష్, సాయి, మహేశ్, గుండా మధు, మధు, అనిల్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఖేలో ఇండియా క్రీడలను అత్యంత

# ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి

### కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో తెలంగాణ ప్రతినిధుల భేటీ



న్యూఢిల్లీ, ఆగస్టు 13: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి శ్రీ వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## తానూర్ డిస్కవరీ డ్రీమ్స్ స్కూల్లో
# ఘనంగా బోనాల వేడుకలు



తానూర్,ఆగస్టు 13(ప్రజా కలం):
మండల కేంద్రంలోని డిస్కవరీ డ్రీమ్స్ స్కూల్లో బుధవారం బోనాల పండుగను కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి. పెంటాజీ విద్యార్థులకు బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని, సంస్కృతిని వివరించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరై సందడి చేశారు. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ బి. రాజుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## తానూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో
# ఉచితంగా కాలేజీ బ్యాగుల పంపిణీ



తానూర్,ఆగస్టు 13(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉచితంగా కాలేజీ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన బ్యాగులను అందుకున్న విద్యార్థులు తీవ్ర ఆనందం, సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ సాయం తమ చదువుకు ఎంతో దోహదపడుతుందని విద్యార్థులు పేర్కొన్నారు.

# విద్యార్థులకు టీషర్టులు, ఐడీ కార్డుల పంపిణీ



తానూర్,ఆగస్టు 13(ప్రజా కలం): మండలంలోని ఎల్వి గ్రామ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా టీషర్టులు, ఐడీ కార్డులు, బ్యాడ్జీలను గురువారం పంపిణీ చేశారు, సీనియర్ పాత్రికేయులు, బీజేపీ జిల్లా జనరల్ సెక్రెటరీ చిన్నారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది, పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు,
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్, సర్పంచ్ ఇర్వంత్ పటేల్, మాజీ ఎంపీటీసీ బాపురావు, మాజీ వీడీసీ అధ్యక్షులు కృష్ణ, నాయకులు గంగాధర్ పటేల్, స్థల దాత పోశెట్టి పాల్గొన్నారు, వీరితో పాటు ఉపాధ్యాయులు భూమన్న యాదవ్, మాధవరావు, సుదర్శన్, సురేష్ కుమార్, రజనీకాంత్, సుజాత దేవి, లక్ష్మి మరియు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

## న్యూ సాంవ్లి గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభించిన ఎమ్మెల్యే



నిర్మల్ ఆగస్టు 13(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుభీర్ మండలంలోని న్యూ సాంవ్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు



తరగతి గదులను ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తోందన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ అవసరాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే ప్రహరీ గోడను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే న్యూ సాశీవ్లి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, గ్రామంలో ఖూ వివో భవనం, గోదాం, సి సి రోడ్లు ,డ్రైన్లు తదితర పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు,అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వాగ్దేవి హైస్కూల్‌లో ఉత్సాహంగా 'మాక్ ఎలక్షన్స్'

## - ప్రజాస్వామ్య విలువలు చాటిన విద్యార్థులు



తానూర్, ఆగస్టు 13(ప్రజా కలం ): విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు మరియు ఎన్నికల వ్యవస్థపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో తానూర్ మండల కేంద్రంలోని వాగ్దేవి విద్యానికేతన్ హైస్కూల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 'మాక్ ఎలక్షన్స్' (నమూనా ఎన్నికలు) గురువారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పి. అరవింద్ రెడ్డి మాట్లాడుతూ... "నేటి విద్యార్థులే రేపటి దేశ నాయకులు, విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు హక్కు ప్రాముఖ్యత, నాయకత్వ బాధ్యతలు మరియు సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవడం వంటి విషయాలపై ప్రాయోగిక అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టాం" అని తెలిపారు, ఈ ఎన్నికల్లో విద్యార్థులు స్వచ్ఛందంగా, పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసి నాయకులను ఎన్నుకున్నారు,మాక్ ఎలక్షన్స్ ద్వారా హెడ్ బాయ్, హెడ్ గర్ల్ పదవులకు విజేతలుగా నిలిచిన అభ్యర్థులకు త్వరలోనే ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది,
పోటీ బరిలో నిలిచి గెలుపొందిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.
విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ స్ఫూర్తిని వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పాఠశాల బృందం పేర్కొంది, ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అవినాష్, ప్రిన్సిపాల్ ఉషాకిరణ్మాయి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీ

## - పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు పోతుగంటి భరత్ ప్రసాద్
## - భారీ తీవర్ణ జెండా తో వేలాది మంది విద్యార్థుల ప్రదర్శనలు



నాగర్ కర్నూల్ ఆగస్టు 13 ప్రజా కలం (ప్రతినిధి ):
స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో సందర్భంగా దేశభక్తి భావనను చాటిచెబుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోనాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ ఉత్సాహపూరితమైన వాతావరణంలో ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. చేతిలో త్రివర్ణ పతాకాలు పట్టుకుని, 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నాగర్ కర్నూల్ పట్టణ పుర వీధులు మార్మోగాయిని ముఖ్య కూడళ్ల గుండా సాగుతూ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపిందన్నారు. దేశాన్ని ఐకమత్యంగా ఉంచే శక్తి త్రివర్ణ పతాకానిదని అంతేకాకుండా భారతీయ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడానికి, యువతలో దేశభక్తిని పెంపొందించడానికి తిరంగా ర్యాలీలు ఎంతగానో దోహదపడతాయి భారీ త్రివర్ణ జెండా తో వేలాది మంది విద్యార్థులు ప్రదర్శనగా వెళ్లడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు ప్రతీ ఒక్కరూ తమ నివాసాలపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశ సమగ్రత మరియు ఐక్యతను చాటాలిని పిలుపునిచ్చారు. దేశ ప్రగతి కోసం మరియు జాతీయ భావనను విస్తృతం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేందర్ గౌడ్ ప్రమోద్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు, యువజన మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు వ్యాకాస రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

## - జైల్లో పెట్టండి లేదా వేతనం చెల్లించండి
## - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్

నాగర్ కర్నూల్ ఆగస్టు 13 ప్రజా కలం (ప్రతినిధి ):
క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో జైల్ బరో కార్యక్రమంలో భాగంగా సిఐటియు వ్యాకాస రైతు సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల సోమవారం నాడు నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ నుండి ర్యాలీతో వెళ్లి బస్టాండ్ ప్రధాన కూడలి వద్దకు చేరుకొని వివిధ రంగాల కార్మికులతో నిరసనలు తెలియజేశారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఆలంభించడమే కాకుండా కార్మికుల హక్కులను కాలరాస్తూ వారి పొట్ట కొడుతుందన్నారు ఈ విధానాలను ప్రభుత్వాలు అవలంబిస్తే కార్మికుల ఐక్యతతో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు కార్మికులకు 26వేల వేతనమైన చెల్లించండి లేదా జైల్లోనైనా పెట్టండి అనే నినాదంతో పిలుపునిచ్చారు అదేవిధంగా బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు పోలీసులు చేరుకొని ప్రజానాయకులను అరెస్టు చేశారు అయినా కొంత సమయం వరకు వివిధ రంగాల కార్మికులు నిరసన తెలియజేశారు శాంతియుతంగా తమ హక్కుల సాధనకై నిరసనలు తెలియజేస్తుంటే అక్రమంగా ప్రజాసంఘాల నాయకులు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని కార్మికుల ఆవేదన చెందారు.
అనంతరం నాయకులతోపాటు కార్మికులు పోలీస్ స్టేషన్ చేరుకొని నినాదాలు చేశారు ప్రజాసంఘాల నాయకులు కార్మికులను శాంతింప చేసి భవిష్యత్తులో మన హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలు తప్పవని తెలిపారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీత డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మధు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న ఉపాధ్యక్షులు అశోక్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు తారాసింగ్ ఆశ అంగన్వాడి గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సంఘాలు వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను
# తప్పనిసరిగా పాటించాలి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 13:
జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కె.జి.బి.వి) చేపడుతున్న సివిల్ పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో కె.జి.బి.వి ల్లో కొనసాగుతున్న పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిని సమీక్షించారు.
పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనులు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో EWIDC డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు,అసిస్టెంట్ ఇంజినీర్లు, కె.జి.బి.వి ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ మోసాల పట్ల
# అప్రమత్తంగా ఉండాలి

### - నందిగామ సీఐ వీరబాబు
### - నాట్కో పరిశ్రమ కార్మికులకు సైబర్ మోసాల పై పోలీసుల అవగాహన



( నందిగామ ఆగస్టు 13 ప్రజా కలం ప్రతినిధి )
సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నందిగామ సీఐ వీరబాబు అన్నారు. గురువారం నందిగామ పోలీసులు మేకగూడ లోని నాట్కో ల్యాబోరేటరీలో కార్మికులకు సైబర్ క్రైమ్, ఆన్లైన్ మోసాలు, రోడ్డు నియమాల పట్ల పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ వీరబాబు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్ మోసాలు చాలా వేగంగా పెరుగుతున్నాయని, ఏ చిన్న పొరపాటు చేసినా కష్టపడి సంపాదించుకున్న డబ్బును, వ్యక్తిగత సమాచారాన్ని కోల్పోవాల్సి వస్తుందని, కాబట్టి డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు మరియు సోషల్ మీడియా వాడేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే 1930 కి వెంటనే తెలియజేయాలని, ఏ అపరిచిత వ్యక్తికి ఓటిపి చెప్పొరాదని, ఎలాంటి ఏపీకే ఫైల్స్ గాని లింక్స్ గాని ఓపెన్ చేయరాదని సూచించారు. అత్యవసర సమయాల్లో 112 నంబరుకు కాల్ చేయాలని తెలిపారు. వాహనదారులు విధిగా రోడ్డు నియమాలు పాటించాలని తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నెట్కో హెచ్ ఆర్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది, నాట్కో కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

### – పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు నాయకులు



నిర్మల్ ఆగస్టు13 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
భైంసాలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు. జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఆయన దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత పెద్ద సంఖ్యలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,విద్యార్థులు నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీ దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగింది.

## కార్యదర్శి చొరవతో రహదారి కి మరమత్తులు

### - గుంతల రహదారి కి మోక్షం



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, ఆగస్టు 13 పోలవరం జిల్లా, ఎటపాక మండలం, గుండాల పంచాయతీలోని పంచాయతీ కార్యాలయం ఎదుట మూడు నెలలుగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారి గుంతల మయంగా ఉండటంతొ గ్రామస్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటం తో స్థానికులు రహదారి సమస్యను పంచాయతీ సెక్రటరీ మాగంటి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో కార్యదర్శి గ్రామస్తులు సహకారంతో రహదారి సమస్యను పరిష్కరించారు. రహదారి సమస్య ను పరిష్కరించినందుకు పంచాయతీ సెక్రటరీ కి గ్రామ పంచాయతీ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్ర రహదారులకు జాతీయ హోదా పురోగతి తెలపండి?

### – ఎన్‌హెచ్ హోదాకు కేంద్రం ప్రాతిపదికలేంటి?
### – రాష్ట్రం నుంచి వచ్చిన ప్రతిపాదనలెన్ని?
### – జిల్లాలవారీగా వాటి పరిస్థితి ఏంటి



ఖమ్మం ఆగష్టు 13(ప్రజా కలం న్యూస్ )
తెలంగాణలోని వివిధ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందుతున్నాయని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్ సభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.
విస్తృత ప్రాతిపదికన ఎంపిక ప్రక్రియ
రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు రాష్ట్ర రహదారులను కొత్త జాతీయ రహదారులుగా ప్రకటించేందుకు ప్రతిపాదనలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. విస్తృత ప్రాతిపదికలు, రహదారుల అనుసంధానత, ట్రాఫిక్ తీవ్రత, వెనుకబడిన ప్రాంతాల అవసరాలు, పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌తో సమన్వయం తదితర అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
తెలంగాణకు 2,500 కి.మీ. కొత్త ఎన్‌హెచ్‌లు..
తెలంగాణలో 2014 నుంచి ఇప్పటివరకు సుమారు 2,500 కి.మీ. మేర కొత్త జాతీయ రహదారులను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినట్లు గడ్కరీ వెల్లడించారు. రాష్ట్రం నుంచి వచ్చే ప్రతిపాదనలను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, అర్హత ఆధారంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటిస్తున్నట్లు వివరించారు.

ప్రజా కలం

శుక్రవారం, ఆగస్టు 14, 2026

## వాయిదాల లోక్‌సభ? ఎవరికి ఉపయోగం?

ప్రజా సమస్యలపై చర్చలు జరపాల్సిన లోక్‌సభ డెడ్‌లాక్ నిరంతరం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ విధానాలు లేదా ఏవైనా వివాదాస్పద అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టడం సహజమే అయినప్పటికీ, ప్రభుత్వం ఒక నిర్దిష్ట అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించినా , స్పీకర్ సమయం కేటాయించినా.. మరో అంశాన్ని ముందుకు తెస్తూ సభను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాలుగా మారుతోంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ప్రతిపక్షాలు వివిధ అంశాలపై చర్చలతో పాటు మంత్రుల ప్రకటనలు, రాజీనామాలను డిమాండ్ చేస్తూ నిరసనలకు దిగడం వల్ల ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ దాదాపుగా కొట్టుకుపోయాయి. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులపై చర్చకు సిద్ధపడినా, ఇతర ప్రాధాన్యతలపై విపక్షాల సభా దిగ్బంధం వల్ల అనేక బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదం పొందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలు సాఫీగా సాగడానికి ప్రజల సొమ్ము కోట్లాది రూపాయలు వెచ్చిస్తుంటే, రోజూ సభ వాయిదాలు పడటంతో ప్రజ సమస్యలు పక్కనపడిపోతున్నాయనే విమర్శలు జాతీయ మీడియాలో ప్రధానంగా వస్తున్నాయి.ఈ తరహా సభా దిగ్బంధం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అసలేమీ చర్చ జరగకుండా సభ వాయిదా పడటం కంటే.. ఏ ఒక్క అంశం పైనైనా సభలో ఫలవంతమైన చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి ఎంతో శ్రేయస్కరం. నీట్ అక్రమాలపై ఢిల్లీలో నిరసనలకు దిగిన విద్యార్థులపై పోలీసుల దాడులపై ఇప్పటివరకూ పార్లమెంట్ కు వచ్చి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముప్పేట దాడి నేపథ్యంలో వెనక్కి తగ్గారు. అమిత్ షాను ఎలాగైనా పార్లమెంట్ కు రప్పించాలని విపక్షాలు పార్లమెంట్ ఉభయసభల్ని స్తంభింపచేస్తున్న వేళ.. ఎట్టకేలకు అమిత్ షా తన నిర్ణయం మార్చుకున్నారు. పార్లమెంట్ కు హాజరై ఢిల్లీ పోలీసుల దాడులపై సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు. నీట్ అక్రమాల నేపథ్యంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ గత నెలలో విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ కు బయలుదేరారు. వీరిని అడ్డుకునేందుకు ఢిల్లీ పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగాలతో పాటు పెల్లెట్ గన్ లను కూడా ప్రయోగించారు. అలాగే మేకులు కొట్టిన లాఠీలతో బాదడం, ఎలక్ట్రిక్ బేటన్లతో కొట్టడం చేశారు. దీంతో భారీ సంఖ్యలో విద్యార్థులు గాయాలపాలయ్యారు. వీరిని వివిధ ఆస్పత్రుల్లో కేంద్రమంత్రులు పరామర్శించారు. అప్పటి నుంచీ ఈ దారుణాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం కోసం విపక్షాలు పట్టుబడుతున్నా కేంద్రం ఒప్పుకోవడం లేదు ఈ నేపథ్యంలో విపక్షాలు నిత్యం ఉభయసభల్ని స్తంభింపచేస్తున్నా అమిత్ షా మాత్రం సభకు రావడం లేదు. దీంతో ఓ దశలో రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ కూడా విపక్షాల డిమాండ్ ప్రకారం అమిత్ షాను సభకు రప్పించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుకు సూచించారు. దీంతో పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్‌లు, బీహార్‌లో ఏకే-47లను ఉపయోగించడంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో హాజరై వివరణ ఇవ్వాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు అంగీకరిస్తున్నట్లు, పోలీసుల చర్యతో సహా విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ప్రతి అంశంపై పార్లమెంటులో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే సభా కార్యకలాపాల సమయంలో ప్రతిపక్షాలు హంగామా సృష్టించకూడదని మంత్రి షరతు పెట్టారు.పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలగకుండా సభ సజావుగా సాగేందుకు తోడ్పడేలా ఉండాలన్నది రాజ్యాంగ నిపుణుల భావన. చర్చల ద్వారా మాత్రమే విధాన నిర్ణయాల్లో లోపాలను సరిదిద్దడం, ప్రభుత్వ జవాబుదారీతనాన్ని నిర్ధారించడం సాధ్యమవుతుంది. రామమందిర విరాళాలపై అమిత్ షా చేసిన ప్రకటనపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో మంగళవారం కూడా నిరసన చేపట్టారు. మాకు అడ్డంకులు సృష్టిస్తారా అంటూ పాలక పక్ష ఎన్‌డీఏ ఎంపీలు పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారాల్లోని ఒకటైన మకర ద్వారం వద్ద ప్రతిపక్ష, పాలక పక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు.ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అణచివేత, రామ మందిరం విరాళాల దుర్వినియోగంపై హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి చర్చించాలని ప్రతిపక్ష ఎంపీలు పట్టుబట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని జార్ఖండ్‌లో నిరసనలు చేపట్టిన విద్యార్థులపై హేమంత్ సోరేన్ ప్రభుత్వం లాఠీచార్జ్ జరిపించిందని, దీనిపై చర్చించడానికి రాహుల్‌గాంధీ పారిపోతున్నారని, డబుల్ గేమ్ ఆడుతున్నారని ఆరోపిస్తూ పాలక పక్ష ఎంపీలు ఎదురు నిరసనలు చేపట్టారు.పార్లమెంటు ను ఉద్దేశించి ప్రసంగించడానికి, ప్రతిపక్షాల ప్రశ్నలకు బదులివ్వడానికి అమిత్ షా సిద్ధంగా ఉన్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు తమ నిరసన కొనసాగించారు. రామ మందింలో విరాళాల దుర్వినియోగంపై ప్రతిపక్ష ఎంపీలు ఒక స్కిట్ ఈ నిరనసలో ప్రదర్శించారు.పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి , స్పీకర్ నేతృత్వంలో విపక్ష నేతలతో చర్చలు జరిపి సభా స్థంభనను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఉభయ పక్షాల మధ్య సమ్మతి కొరవడటంతో గందరగోళం కొనసాగుతోంది. ఏదేమైనా, విపక్షాలు వాకౌట్‌లు లేదా ఆందోళనలతో సమయాన్ని వృథా చేయకుండా, దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం ఇచ్చే చర్చల్లో పాల్గొనడమే ప్రజాస్వామ్య బలాన్ని పెంచుతుంది.ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

## తీజ్ పండుగ వేడుకలకు కొత్తగూడెం సిద్ధం

**15 నుంచి 23 వరకు సాంస్కృతిక సంబరాలు - ప్రగతి మైదానంలో ఏర్పాట్లు పూర్తి**

**బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 13: (ప్రజా కలం న్యూస్)

బంజారా జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే తీజ్ పండుగ వేడుకలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించేందుకు బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసన్నద్ధమైంది.ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు సాంప్రదాయబద్ధంగా తీజ్ ఉత్సవాలను నిర్వహించనున్నారు.గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం బంజారా సంఘాల జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ మాట్లాడుతూ బంజారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి కుటుంబం ఈ వేడుకల్లో భాగస్వామ్యం కావాలని బంజారా సంస్కృతిని కాపాడుకుందాం తీజ్ పండుగను జాతి పండుగగా జరుపుకోవాలని బానోత్ వీరు నాయక్ పిలుపునిచ్చారు.

**14న గోధుమలతో శుభారంభం**

ఈనెల 14వ తేదీన గోధుమలు నానబెట్టే కార్యక్రమంతో వేడుకలకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. 15వ తేదీ నుంచి 23వ తేదీ రాత్రి వరకు ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొత్తగూడెం ప్రగతి మైదానంలో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

**బంజారా నృత్యాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

ఈ తొమ్మిది రోజుల్లో సాంప్రదాయ పద్ధతిలో పార్వతీదేవి పూజలు, భజనలు, బంజారా జానపద నృత్యాలు, ఆటపాటలతో ఏర్పాటు చేస్తున్నాం యువతకు సాంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు, కవి సమ్మేళనం కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**అందరూ భాగస్వాములు కావాలి**

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, కుల సంఘాల ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఇటీవల సంత్ సేవాల్ మహరాజ్ జయంతి, శీత్లా పండుగ, హాతీరాం బావాజీ జయంతిని కూడా ఐకమత్యంగా నిర్వహించామని గుర్తుచేశారు.

**భారీ ఏర్పాట్లు...** ప్రగతి మైదానంలో లైటింగ్, స్టేజి, కూర్చునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, పోలీసు, ట్రాఫిక్, వైద్య బృందాలతో సమన్వయం చేసినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో జేఏసీ నాయకులు గుగులోత్ కేశవ్, గుగులోత్ భద్రు, ధరావత్ కృష్ణ, భట్టు మంజుల, అజ్మీరా లైలా, జర్పుల బిక్కులాల్, బానోత్ సైదా, లావుడ్య హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతాను

**- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

**- మహాగాం, కామోల్ గ్రామాల్లో 6 మహిళా సమైక్య భవనాలు ప్రారంభం**



నిర్మల్ ఆగస్టు 13 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని, ప్రతి గ్రామంలో రెండున్నర సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. గురువారం భైంసా మండలంలోని మహాగాం, గ్రామంలో రెండు మహిళా సమైఖ్య భవనాలు, కామోల్ గ్రామంలో నాలుగు మహిళా సమైఖ్య భవనాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అదే విధంగా కామోల్ 12 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సి సి డ్రైనేజీ పనులను ప్రారంభించారు.మహాగాం గ్రామంలో ఇప్పటివరకు 80 లక్షల రూపాయలతో సి సి రోడ్లు, 42 లక్షల రూపాయల నిధులతో చెరువు నిర్మాణం, 20 లక్షల రూపాయల నిధులతో సమైక్య భవనాల నిర్మాణం చేసి ప్రారంభించడం జరిగిందని చెప్పారు. విద్యుత్ సబ్ స్టేషన్, 10 ఎకరాల స్థలంలో విశాలమైన గోదాముల నిర్మాణానికి నిధులు ఇచ్చామన్నారు. అదేవిధంగా కామోల్ గ్రామంలో సైతం రెండు కోట్ల రూపాయల నిధులతో పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా అభివృద్ధికి అడిగినంత నిధులు ఇస్తున్నారని సర్పంచ్ లు రాజ్యలక్ష్మి రాకేష్, చిన్నయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పారు. భైంసా మండలంలోమహిళ సమైక్య భవనాలకు 6కోట్ల 50 లక్షల రూపాయల నిధులు ఇవ్వడం జరిగిందని జిల్లా డి ఆర్ డి ఏ పి డి విజయలక్ష్మి తెలియజేశారు. మహిళల తరపున ఎమ్మెల్యేకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు మహిళా సంఘాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.పెద్ద మొత్తంలో మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, సర్పంచ్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## తల్లాడ మండలంలో ముందంజలో

# 'తల్లాడ' గ్రామపంచాయతీ

**- గ్రామ అభివృద్ధి, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి..**

**- శాశ్వతంగా తీరిన మంచినీటి సమస్య: సర్పంచ్ పి. నాగేశ్వరరావు**



తల్లాడ: ఆగస్టు 13 ప్రజా కలం న్యూస్

మండల కేంద్రమైన తల్లాడ గ్రామపంచాయతీ అభివృద్ధి పథంలో ముందంజలో దూసుకుపోతోందని సర్పంచ్ పి. నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కే. లక్ష్మారెడ్డి తెలిపారు. గత వారం రోజులుగా గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా సౌకర్యార్థం మరియు పారిశుధ్య మెరుగుదల కోసం విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టారు.గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలకు గడ్డి మందు పిచికారీ చేయించి పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే వర్షాకాలం దృష్ట్యా దోమల వ్యాప్తిని అరికట్టడానికి 'కింగ్ ఫామ్' ఫాగింగ్ మిషన్ ద్వారా గ్రామం మొత్తం దోమల నివారణ చర్యలు చేపట్టారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు పాడుబడిన, పూడిక పేరుకుపోయిన మురుగు కాలువలకు ప్రత్యేక మరమ్మత్తులు నిర్వహించారు.

**తీరిన మంచినీటి కష్టాలు:**

ఇటీవల మిషన్ భగీరథ నీటి సరఫరాలో సాంకేతిక సమస్యల కారణంగా గ్రామ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ పాలకవర్గం త్వరితగతిన స్పందించింది. వైరా చెరువు నుండి తల్లాడ గ్రామపంచాయతీకి శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ శాశ్వత ఏర్పాటుతో గ్రామ ప్రజల మంచినీటి అవసరాలు పూర్తిగా తీరాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గ్రామ ప్రజల ఆరోగ్య రక్షణ, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీహరి కృష్ణ,వార్డు సభ్యులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 13: ఆగస్టు 15న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ శాసనసభ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2026 ఆగస్టు 15న ఉదయం 9:30 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు.భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వివిధ జిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణకు ప్రముఖులను ప్రభుత్వం నామినేట్ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగే వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది.జాతీయ పతాకావిష్కరణ అనంతరం ఆయన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని అందించడంతో పాటు తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను వెల్లడించనున్నారు.

## నాణ్యమైన ఆహారం అందించాలి

**- కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల పరిశీలన**

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగష్టు 13: దేవరకద్ర మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ జూనియర్ కళాశాల, హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల, హాస్టల్‌లోని వంటగది పరిశుభ్రత, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మౌలిక వసతులు, హాస్టల్ సేవలను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, విద్యా ప్రమాణాలు, హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల సమస్యలు, అవసరాలను తెలుసుకున్న అదనపు కలెక్టర్ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని, విద్యా, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను సూచించారు.ఈ తనిఖీలో దేవరకద్ర ఎం.పి.ఓ, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జన్ను కనకరాజు మాదిగకు ఘనంగా జన్మదిన వేడుక ముఖ్యఅతిథిగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్



ఖమ్మం, ఆగస్టు 13( ప్రజా కలం న్యూస్ ) తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ( టీఎం హెచ్ డి ) వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ జన్మదిన వేడుకలను ఖమ్మం నగరంలోని టీఎంహెచ్డీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లిగుండ్ల ముత్తయ్య మాదిగ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ (దళితరత్న) హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత 33 ఏళ్లుగా మాదిగ హక్కులు, ఎస్సీ వర్గీకరణ కోసం జన్ను కనకరాజు మాదిగ చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. అంబేద్కర్, బాబు జగజీవన్‌రామ్, కాన్షీరామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కనకపూడి వీరస్వామి, కొండా వెంకన్న, సంజీవరావు, శ్రీనివాసరావు, నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మాజీమంత్రి రేణుకా చౌదరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మానుకొండ, గుర్రం



తల్లాడ ఆగస్టు 13 ప్రజా కలం న్యూస్ కేంద్ర మాజీ మంత్రి, ఖమ్మ. జిల్లా ఫైర్ బ్రాండ్ గారపాటి రేణుకా చౌదరికి ఖమ్మంజిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్, ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పాత పినపాక గ్రామ సర్పంచ్, సీనియర్ నాయకులు గుర్రం శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఢిల్లీలోని నివాసంలో ఆమెకు పుష్పగుచ్చం అందించి ప్రత్యేక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కేంద్రమంత్రిగా, ఖమ్మం జిల్లా ఆడబిడ్డగా ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కూడా ఆమె ఆధ్వర్యంలో భారీగా నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాత గీతం ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజాకలం ప్రతినిధి ఆగస్టు 13:
భావి భారత పౌరులు విద్యార్థులకు భరతమాత గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ రచయిత,గాయకుడు తిరుమల నాగేంద్ర రచించిన భరత మాత గీతాన్ని గురువారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. రాబోయే భవిష్యత్ తరాలకు ఇది చాలా ఆదర్శంగా ఉంటుందని భావి భారత పౌరులైన విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని, నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ గీతం ఉందని కలెక్టర్ గేయ రచయితని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్ ,కవి, రచయిత, ఎం ఎన్ విజయకుమార్ ,స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పొలాల్లో శిశువు మృతదేహం లభ్యం



పాలేరు ఆగస్టు 13 (ప్రజా కలం న్యూస్)
కూసుమంచి మండలంలోని నెల్లూరి వెంకటేశ్వర్లు, వరి పొలంలో సుమారు నాలుగు నుంచి ఆరు నెలల వయస్సు గల గుర్తుతెలియని పిండం ప్లాసెంటాతో కలిసి లభ్యమైంది. ఈ ఘటనపై కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో అందిన సమాచారంతో వైద్యాధికారి డాక్టర్ ఈ. సాయి కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పిండాన్ని వైద్య, న్యాయ వైద్య పరీక్షల నిమిత్తం ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు.
ఈ ఘటనపై పోలీసు అధికారులు విచారణ నిర్వహించి, పిండం ఎవరిదనే విషయంతో పాటు సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఆగస్టు 15న 40 శాతం వేతన సవరణ ప్రకటించాలి

**– తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య**



ఆగస్టు 13 హనుమకొండ: ( ప్రజా కలం ప్రతినిధి )ఆగస్టు 14న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై చర్చించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు మరుపట్ల మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన వేతన సవరణ సంఘం నివేదికను ప్రకటించకుండా కేవలం ఐదు శాతం మధ్యంతర భృతిని ఇచ్చి చేతులు దులుపుకుందని ఆయన విమర్శించారు.ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఆరు నెలల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, వేతన సవరణను ప్రకటిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా వేతన సవరణ అమలులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మరికొన్ని రోజులు గడిస్తే ప్రస్తుత వేతన సవరణ కాలపరిమితి కూడా ముగిసే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 40 శాతం వేతన సవరణతో కూడిన కొత్త వేతన సవరణను ప్రకటించాలని మల్లయ్య డిమాండ్ చేశారు.

## బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా కొట్టం మోహన్

అయినవోలు: భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా అయినవోలు గ్రామానికి చెందిన కొట్టం మోహన్ను నియమించినట్లు పార్టీ నాయకత్వం ప్రకటించింది. పార్టీలో చురుకైన కార్యకర్తగా కొనసాగుతున్న కొట్టం మోహన్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించడంపై అయినవోలు మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు. తనపై నమ్మకం ఉంచి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కొట్టం మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దండు కిషన్ తదితర నాయకులు కొట్టం మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లాలో రైతాంగ సమస్యలపై కిసాన్ మోర్చా కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు గతంలోనూ వార్తలు వెలువడ్డాయి.



# ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు

**ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి**

**వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి - బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**

మరిపెడ ప్రజా కలం ఆగస్టు 13 ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ,ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సూచించారు.బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం మరిపెడ మండలంలోని గాలివారిగూడెం,ఎల్లంపేట గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు.ఈ శిబిరాలకు డాక్టర్ గుగులోతు రవితో పాటు గాలివారిగూడెం సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి,ఎల్లంపేట సర్పంచ్ గండి రాధమ్మ,ఎంఎల్‌హెచ్‌పీలు సతీష్,అమిత హాజరయ్యారు.వైద్యులు సుమారు 280 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా,టైఫాయిడ్,వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఇంటి లోపల,బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పగటిపూట కుట్టే దోమల ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని,ఈ దోమలు మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతాయని తెలిపారు.ఇంటి పరిసరాల్లోని కుండీలు,కూలర్లు,ఉపయోగం లేని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.దోమల నియంత్రణతో వ్యాధులను అరికట్టవచ్చని,పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పులు,కాలుష్యం కారణంగా అనేక మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని డాక్టర్ రవి



తెలిపారు.ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.బిజీ జీవనశైలి కారణంగా చాలామంది ఆరోగ్యంపై శ్రద్ధ చూపకపోవడంతో చిన్న వయసులోనే బీపీ,షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు.నిత్యం వ్యాయామం చేయడంతో పాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని,ఆరోగ్య నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీదేవి,కార్యదర్శులు మంజుల,స్వప్న, ఏఎన్ఎంలు హుస్సేన్ బి,విజయ,బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర,జుజ్జూరి ఉపేంద్ర,గుగులోత్ కవిత, ఆశా వర్కర్లు జ్యోతి,మాధవి,గణిత,పార్వతి, రమాదేవి, జ్యోతి,ఉపేంద్ర, నీల,కారోబార్ హుస్సేన్,గ్రామ పెద్దలు, గ్రూప్ లీడర్లు,మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పైర్ సమ్మిట్ - 3.0 లో ఎంఎంఆర్‌డి బ్రాంచ్‌కు ఘన సత్కారం




ఖమ్మం ఆగస్టు 13(ప్రజా కలం న్యూస్ )
ఖమ్మం గురువారం నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పారామం కళా వేదికలో నిర్వహించిన ఆస్పైర్ సమ్మిట్ - 3.0 కార్యక్రమంలో నారాయణ ఈ టెక్నో స్కూల్ ఎం ఎం ఆర్ డి బ్రాంచ్ విద్యా రంగంలో సాధించిన ఘన విజయాలకు ప్రత్యేక పురస్కారాలు అందుకుంది. 2025 - 26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక శాతం ఫలితాలు సాధించినందుకు ఎం ఎం ఆర్ డి బ్రాంచ్‌కు వెండి నాణేలతో పాటు రూ.40,000 నగదు పురస్కారం అందజేశారు . విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలను ఖమ్మం నారాయణ విద్య సంస్థల ఏ.జీ.ఎం ఎస్. రాంకీ , ఆర్.ఐ క్రాంతి కుమార్ ఈ సందర్భంగా అభినందించారు . అదే విధంగా సబ్జెక్టు వారీగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు కూడా నగదు పురస్కారాలు , వెండి నాణేలతో సత్కారం జరిగింది . ఇంగ్లీష్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానాన్ని సాధించిన ఓ. తిరుపతిరావు , హిందీ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్.కె. నజియా పురస్కారాలను అందుకున్నారు . ఈ సందర్భంగా నారాయణ ఈ టెక్నో స్కూల్ ఎం ఎం ఆర్ డి బ్రాంచ్ ప్రిన్సిపాల్ జి. నవీన్ కుమార్ , ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు . విద్యార్థుల విజయమే లక్ష్యంగా ఉపాధ్యాయులు చేస్తున్న నిరంతర కృషికి లభించిన ఈ గుర్తింపు మరింత స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు . భవిష్యత్తులోనూ ఎం ఎం ఆర్ డి బ్రాంచ్ మరిన్ని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఉపాధ్యాయుల సౌజన్యంతో ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రింటర్ ఏర్పాటు



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 13, ప్రజాకలం ప్రతినిధి.
గురువారం స్థానిక ఎంపీపీఎస్ పర్వతగిరి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సౌజన్యంతో పాఠశాలకు ప్రింటర్ను సమకూర్చుకోవడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో ప్రింటర్ ఉండడం వలన విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం సులభం అవుతుందని చెప్పడం జరిగింది. గురువారం విద్యార్థులకు సుభాషిని, తిథి భోజనం సందర్భంగా అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె. నవీన్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ రామస్వామి, ఏఏపీసి చైర్ పర్సన్ నీరటి జ్యోతి, కాంప్లెక్స్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు, ఉపాధ్యాయులు లలితా దేవి, నవీన్ కుమార్, ప్రసాద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమరవాది సారంగపాణి నియామకం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘంలో ఐనవోలు నేతకు కీలక పదవి**
**- ఆర్.కృష్ణయ్య,గోర్ల ఐలేష్ యాదవ్‌లకు సారంగపాణి ధన్యవాదాలు**
**- చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల సాధనే లక్ష్యం: నూతన అధికార ప్రతినిధి సారంగపాణి**
**- బీసీలను సంఘటితం చేసి ఉద్యమిస్తాం: అమరవాది సారంగపాణి**

హన్మకొండ/ఐనవోలు: (ప్రజా కలం ప్రతినిధి)
బీసీల సామాజిక, రాజకీయ చైతన్యం మరియు వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న అమరవాది సారంగపాణిని “జాతీయ బీసీ సంక్షేమ సంఘం” తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు, జాతీయ ప్రధాన కార్యదర్శి గోర్ల ఐలేష్ యాదవ్ ఈ నియామక ఉత్తర్వులను మంగళవారం (11-08-2026) రోజున విడుదల చేశారు.సారంగపాణి హన్మకొండ జిల్లా, ఐనవోలు గ్రామానికి చెందినవారు. బీసీల అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అమరవాది సారంగపాణి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కి,జాతీయ ప్రధాన కార్యదర్శి గోర్ల ఐలేష్ యాదవ్ కి,అలాగే సంఘ నాయకులు సుందర్ రాజ్ యాదవ్, పులివేణి పోచమల్లు యాదవ్, వేముల శ్రీనివాస్ తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో బీసీల సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని, బీసీలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సంఘటితం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.
అలాగే చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిస్తానని తెలిపారు.సారంగపాణి నియామకం పట్ల స్థానిక బీసీ నాయకులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## చేపల వేటకు వెళ్లి వచ్చి.. అనంత లోకాలకు....

**తాడిచర్లలో విషాదం.. మత్స్యకారుడు పిట్టల ఓదెలు దుర్మరణం...**

మల్హర్, ఆగస్టు 13 ప్రజాకలం ప్రతినిధి... మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన మత్స్యకారుడు పిట్టల ఓదెలు గురువారం అకస్మాత్తుగా మృతి చెందారు. రోజులాగే చేపలు పట్టేందుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకున్న ఆయన, తీవ్ర చలితో వణుకుతూ ఇంటి ముందు రోడ్డుపై అకస్మాత్తుగా కుప్పకూలారు. చుట్టుపక్కల వారు గమనించి వచ్చేలోపే ఆయన ప్రాణాలు విడిచారు.చేపలు పడుతూ జీవనం సాగించే ఓదెలు మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న కొయ్యూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా భూక్య రాములు వరుసగా మూడోసారి ఏకగ్రీవ ఎన్నిక

(వరంగల్/పర్వతగిరి)ఆగస్టు 13, ప్రజాకలం ప్రతినిధి.
పీఆర్‌టీయూ టీఎస్ పర్వతగిరి మండల శాఖ అధ్యక్షుడిగా భూక్య రాములు వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఏనుగల్లు జడ్పీహెచ్‌ఎస్‌లో మండల అధ్యక్షుడు భూక్య రాములు అధ్యక్షతన పీఆర్‌టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్‌టీయూ టీఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సెప్టెంబర్ 1న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమానికి పర్వతగిరి మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
అనంతరం పీఆర్‌టీయూ టీఎస్ పర్వతగిరి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్య రాములు, ప్రధాన కార్యదర్శిగా మేడిది నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా సాంబారి అనిల్‌కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా ఆర్. కల్పన, ఉపాధ్యక్షులుగా కే. దామోదర్‌రెడ్డి, ఎం. రమేష్, మహిళా ఉపాధ్యక్షులుగా వై. రాణి రుద్రమదేవి, కె. శ్వేత ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఆర్. రాజు, జి. రాజు, మహిళా కార్యదర్శులుగా కే. లలితాదేవి, ఎన్. ప్రశాంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా గీసుకొండ మండల జనరల్ సెక్రెటరీ మార్త శ్రీను, దుగ్గొండి మండల అధ్యక్షుడు పొగాకు అచ్చయ్య, నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శి బానోతు కృష్ణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎన్వీఆర్ రాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొనుగోటి అశోక్‌రావు, ధీకొండ నరసింహారావు, బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కటకం రఘుతో పాటు జిల్లా, మండల బాధ్యులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ టీఎస్ ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.



## గురుకుల పాఠశాల విద్యార్థినులకు హెల్త్ చెకప్




(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 13, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో నేడు విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణకై హెల్త్ చెకప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల ఆరోగ్యాధికారి డా. ఝాన్సి , డా.రాణీ, ఏఎన్ఎం హేమలత, ఆశ వర్కర్ స్వప్న, రమ పాల్గొన్నారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు గల విద్యార్థులకు వివిధ ఆరోగ్య సూచనలను, మందులను అందించారు. అవసరమైన విద్యార్థులకు చికిత్స నిమిత్తం ఎంజిఎం కి సూచించారు.

## అంబేద్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా తక్కెళ్ళపల్లి రాజు ఏకగ్రీవం ఎన్నిక



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 13, ప్రజాకలం ప్రతినిధి.పర్వతగిరి కల్లెడ గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడిగా తక్కెళ్ళపల్లి రాజును ఎన్నుకోవడం జరిగినది. అంబేద్కర్ అభ్యుదయ వాది, అంబేద్కర్ ఆశయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నూతన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా తక్కలపేల్లి రాజు మాట్లాడుతూ, నా ఎన్నికకు సహకరించిన కులపెద్దలకు, సంఘం నాయకులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేద్కర్ కమిటీ సభ్యులు ఉపాధ్యక్షులు దాసరి సారయ్య, ప్రధాన కార్యదర్శి పసుల శ్రీనివాస్, కోశాధికారి రాపాక అరుణ్, సహాయకులు బురికి వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## మెటపల్లి లో గోరింటాకు సంబరాలు



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 13(ప్రజాకలం) మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో గురువారం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పురపాలక పరిధిలోని కౌన్సిలర్లు, అధ్యక్షులు, ఆర్పీలు, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు పెట్టుకుని సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, మెప్మా సిబ్బంది, ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మండల సోషల్ మీడియా ఇన్‌చార్జీల నియామకం

మల్లాపూర్ ఆగస్టు 13 (ప్రజా కలం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సోషల్ మీడియా కన్వీనర్లుగా రాఘవపేటకు చెందిన నత్తిరామ్, వేంపల్లికి చెందిన పోతు శేఖర్‌ను నియమించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాలకు సోషల్ మీడియా ఇన్‌చార్జీలను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ఎల్లాల జలపతిరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకుని చూసుకుంటామని హామీ ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిపేట్‌లో సీసీ కెమెరాలపై అవగాహన...



మల్లాపూర్ ఆగస్టు 13 (ప్రజా కలం ప్రతినిధి )

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మొగిలిపేట్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో, ఎస్సై ఎ. అనిల్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నేరాల నియంత్రణ, నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు.

## ధర్మారం తహసిల్దార్ కు వినతి

ధర్మారం, ఆగస్టు 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించా లని ముఖ్యమంత్రి



గారికి ధర్మారం తహసిల్దార్ ద్వారా మెమోరండం శీ సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉద్యో గులకు ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ లో లు ఉన్న డి ఏ లు విడుదల చేయాలని, జీవో 25 సవరించాలని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛతీష్ గడ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టినారని కావున వెంటనే మన రాష్ట్రం లో సిపిఎస్ రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీం వెంటనే అమలు చేయాలని ఎంప్లాయ్ హెల్త్ స్కీం విధివిధానాలు వెంటనే రూపొందించి హెల్త్ కార్డులు విడుదల చేయాలని సర్వీస్ లో ఉన్న ఉపాధ్యా యులకు, ఉద్యోగులకు రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు నెలకు రెండువేల కోట్లను విడుదల చేయాలని తెలుపుతూ మేమోరండం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో యు ఎస్ పి సి నాయకులు ఎస్ మల్లారెడ్డి, కే కనకయ్య, ఏ వి శేషగిరిరావు, ఇ శ్రీనివాస్, డి సుభాషిని మహేముద కహుతున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్,ఆగస్టు13 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):మండల ప్రజా పరిషత్ శ్రీరాంపూర్ కార్యాలయంలో నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సమావేశానికి హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు ను తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగు రవి శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్‌గా,ఎమ్మెల్యేగా విజయరమణరావు నియోజకవర్గం ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.అలగే తెలంగాణ పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.



### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను

# ఘనంగా నిర్వహించాలి

### - ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం)

జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లను అధికారులు సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, డీఆర్‌డీఏ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ఆహ్వానితులు, విద్యార్థులు, ప్రజలకు తాగునీరు, వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం నిర్వహించే పరేడ్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను కూడా పరిశీలించారు. విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లను నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలంతా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవంగా, దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజ గౌడ్, డీఆర్‌డీఏ పీడీ రఘువరన్, డీపీఆర్ఓ శ్రీధర్, కలెక్టరేట్ ఏఓ కిషన్, ఎమ్మార్వో రామ్మోహన్, రెవెన్యూ, మున్సిపల్, డీఆర్‌డీఏ, పోలీస్ శాఖల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బోధన శైలిని మెరుగుపరచుకోవాలి

### - జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం)

నూతన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా వై. రమేష్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్–711 ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై. రమేష్ బాబు మాట్లాడుతూ నూతన సిలబస్‌కు అనుగుణంగా డిజిటల్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి లెక్చరర్ తమ బోధనా శైలిని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, టై, బెల్ట్, షూస్ తదితర సౌకర్యాలు ప్రతి విద్యార్థికి అందేలా లెక్చరర్లు చొరవ తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను



పెంచడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్–711 జిల్లా అధ్యక్షుడు వి. నర్సయ్య, కార్యదర్శి పి. తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. రాజేశ్, రాష్ట్ర కార్యదర్శి విజేందర్, కోశాధికారి సి.హెచ్. నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

### - ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



పెద్దపల్లి,ఆగస్టు13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి చిన్న సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు స్పష్టం చేశారు.కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్పంచుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకాగా సర్పంచులు ఆయనను ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో గ్రామసభలు,మండల సర్వసభ్య సమావేశాలకు పలువురు అధికారులు హాజరుకావడం లేదని,దీనివల్ల గ్రామ సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు ఇకపై జరిగే సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరుకావాలని, చర్చకు వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మొట్లపల్లి సర్పంచ్ తుల మనోహర్‌రావు మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన కాజ్‌వేల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని కోరగా,పలు గ్రామాల్లో అంగన్‌వాడీ,పంచాయతీ భవనాలు లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని సర్పంచులు తెలిపారు.అలాగే కాల్వశ్రీరాంపూర్ 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ సౌకర్యం లేక సేవలు ఆరు పడకలకు పరిమితమయ్యాయని,వ్యవసాయ క్షేత్రాల వద్ద వంగిపోయిన విద్యుత్ స్తంభాలు,వేలాడుతున్న తీగలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని,ఆరేపల్లి ప్రభుత్వ పాఠశాల భవనంలో విద్యుత్ షాక్ వస్తుండటంతో విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందని సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు.సర్పంచులు ప్రస్తావించిన అన్ని సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించచారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి శ్రీమాల,పంచాయతీరాజ్ శాఖ డీఈ రవీందర్ రెడ్డి, డీపీఓ దేవకీదేవి,తహసీల్దార్ రాపెల్లి రాముడు,సూపరింటెండెంట్ శ్రీధర్,సీనియర్ అసిస్టెంట్ రవి,వివిధ అభివృద్ధి శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## బీర్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడి

### - రూ.30 వేల లంచం తీసుకుంటూ ఆర్ ఐ రాహుల్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం) బీర్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడి నిర్వహించారు. రూ.30 వేల లంచం తీసుకుంటూ గిరిధావర్ రాహుల్ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చు బిగించారు.లంచం తీసుకుంటున్న సమయంలో రాహుల్‌ను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, లంచం డిమాండ్‌కు కారణమైన అంశాలపై ఏసీబీ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.



## ఎస్ఐ శ్యామ్ రాజ్‌కు ఎంఐఎం నాయకుల సన్మానం



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 13 (ప్రజాకలం): కోరుట్ల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్ రాజ్‌ను ఎంఐఎం కోరుట్ల పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. రఫీ ఆధ్వర్యంలో నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎం.ఏ. రఫీ మాట్లాడుతూ గతంలో కోరుట్ల పట్టణంలో ఎస్ఐ శ్యామ్ రాజ్ అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆయనను తిరిగి కోరుట్లకు బదిలీ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు తమ పార్టీ తరఫున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రజలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు లేదా సమస్య ఎదురైనప్పుడు పోలీసులను సంప్రదించాలని, పోలీసు అధికారులు తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని రఫీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం కోరుట్ల శాఖ కార్యదర్శి అబ్దుల్ వాజిద్, సహాయ కార్యదర్శులు మహ్మద్ నిజాముద్దీన్, అబ్దుల్ రహీం, కె. సురేశ్, కోశాధికారి ముజాహిద్ ఖాన్‌తో పాటు మహ్మద్ ఫయాజ్, మహ్మద్ సల్మాన్, మహ్మద్ నాహీద్, మహ్మద్ అర్మాన్, మహ్మద్ సమీర్, అబ్దుల్ హమీద్, సుహేల్, షహబాజ్, ఇర్ఫాన్, సలీం, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, ఆగస్టు 13, ప్రజాకలం, ప్రతినిధి :

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రంలో గల నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి



సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 80 మందికి రూ.25.56 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనట్లు తెలిపారు. వైద్య చికిత్స తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తూ వారికి భరోసాను ఇస్తుందని అన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ శేఖర్, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## "పొలంబడి - రైతులతో ముఖాముఖి" కార్యక్రమం నిర్వహణ



ఇబ్రహీంపట్నం ఆగస్టు 13( ప్రజాకలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అనుభవం ద్వారా వ్యవసాయం, రైతుల కష్టం, పంటల సాగు విధానాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీపీయస్ వర్షకొండ పాఠశాల ఆధ్వర్యంలో ఈరోజు "పొలంబడి – రైతులతో ముఖాముఖి" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు సమీపంలోని వరి పొలాలను సందర్శించి, వరి నాట్లు వేసే విధానం, నారు పెంపకం, పొలాన్ని సిద్ధం చేయడం, నీటి వినియోగం, ఎరువుల వినియోగం, పంట సంరక్షణ, దిగుబడి తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులు రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు, రైతులు పడే శ్రమ, పంట సాగుకు అయ్యే ఖర్చులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం తదితర విషయాలను అడిగి...

## పిల్లలకు ఉచిత యూనిఫాం పంపిణీ చేసిన సర్పంచ్

గొల్లపల్లి ఆగస్టు 13 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలం లోత్తునూర్ గ్రామంలోనీ మొదటి అంగన్వాడి కేంద్రంలోని పిల్లలకు గ్రామ సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాంలు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పిల్లల చదువు, ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ



పథకాలను అమలు చేస్తుందని, పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో చదువు, ఆటల తో పాటు రోజు పాలు, గుడ్లు,బాలమృతం లాంటివి అందిస్తున్నారని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడి కేంద్రానికి పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరగంటి మల్లేష్, వార్డు సభ్యులు ఆకుల రాజు స్వప్న, లక్కం శ్రీకాంత్, లక్కం రవి, లక్కం లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి మణికంఠ, అంగన్వాడి టీచర్ రేగొండ వసంత, మద్దెల ప్రభాకర్, తౌటు చందు, పిల్లలు ,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యం లో తహసిల్దార్ కు వినతి



ఎండపల్లి, ఆగస్టు 13 : ( ప్రజా కా లం ప్రతినిధి ) ఎండపల్లి మండల కేంద్రం లో ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యం లో ఉపాధ్యా యుల సమస్యల పరి ష్కారం కోసం యు ఎస్ పి సి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ చేపట్టిన దశల వారి పోరాట కార్యక్రమం లో భాగంగా ఎండపల్లి తహసిల్దార్ కు మెమోరండం సమ ర్పించారు. ఈ కార్యక్రమం లో యు ఎస్ పి సి రవీందర్ రెడ్డి, ఆగమయ్య, నాగ భూషణం, ఎస్ రవి కుమార్, నరసింహచారి, అంజనా దేవి, శ్రీలత, సుమలత, కృష్ణ వేణి, అంజయ్య, సుధాకర్, సదానందం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు వీలైనంత తొందరగా పి ఆర్ సి ప్రకటించాలని, పెండిగు లో ఉన్న డి ఎ లు అమలు చేయాలని, నూతన పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్దరించాలని, విద్యా శాఖ లో 190 జీవో ను అమలు పరచాలని ఉ పాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

## ఆయూష్ హౌస్ సర్జన్ల నిరసన నినాదాలు చేస్తున్న హౌస్ సర్జన్లు, వైద్య విద్యార్థులు

బల్కంపేట : అల్లోపతి వైద్యసర్జన్లతో సమానంగా తమకు ప్రభుత్వం ఉపకార వేతనాన్ని పెంచాలని ఆయూష్ హౌస్ సర్జన్లు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆయూష్ హౌస్ సర్జన్లు, పీజీ స్కాలర్ల జేఏసీ పిలుపు మేరకు బల్కంపేటలోని కొణి జేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయంలో పని చేస్తున్న హౌస్ సర్జన్లు గత తొమ్మిది రోజులు నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వీరికి ప్రస్తుతం ప్రకృతి వైద్య అభ్యసి స్తున్న విద్యార్థులు మద్దతు పలికారు. తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలనుంచి తమకు ఉపకార వేత నాన్ని పెంచలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆయూష్ జూనియర్ వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపకార వేతనాన్ని పెంచే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వంట ఏజెన్సీపై చర్య తీసుకోవాలి

హొళగుంద :విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో తీవ్రంగా విఫలమైన వంట ఏజెన్సీ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఖాళీ ప్లేట్లతో భారీ నిరసన తెలిపారు.వివరాలోకెళ్తే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు ఒకే వంట ఏజెన్సీ ఉంది.అయితే ఏజెన్సీ కళాశాలకు సమయానికి భోజనం అందించకుండా,ఉడికి ఉ డకని అన్నం,నీళ్ల సాంబారు అందిస్తూ విద్యార్థుల కడుపు కొడుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు,విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ముందుగా వంట ఏజెన్సీని తొలగించి జూనియర్ కళాశాల నందు మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు వంట ఏజెన్సీని నియమించాలని తహసీల్దార్ లక్ష్మీ రాజు, ఎంఈఓ – 2 కబీర్ సాబ్ కు వినంతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థినీయులు ఉష,యోగిత మాట్లాడుతూ వంట ఏజెన్సీ నాణ్యమైన భోజనం అందించడం లేదని మరియు సమయానికి మధ్యాహ్న భోజనం అందడం లేదని తెలిపారు.అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వంట ఏజెన్సీ పై చర్య తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా విద్యార్థుల కడుపు కొడుతున్న ఏజెన్సీ పై చర్యలు తీసుకోకపోతే విద్యార్థులతో రాస్తా రోకా చేస్తామని హెచ్చరించారు.అలాగే జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు కొత్త ఏజెన్సీ నియమించాలన్నారు.ఇందుకు స్పందించిన తహసీల్దార్ లక్ష్మీ రాజు రెండు రోజుల్లో త్రీమెన్స్ కమిటీతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎరిగేరి హై స్కూల్ విద్యార్థుల ఘన విజయం

కౌతాళం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎరిగేరి విద్యార్థులు డిసెంబర్ 2025లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.రజత,యు.నిఖిల్, ఎం.అజయ్ ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపికయ్యారు.ఎంపికైన ప్రతి విద్యార్థికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్ లభిస్తుంది.ఈ విజయం విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి మరియు తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనంగా నిలిచింది.విద్యార్థుల విజయానికి ప్రత్యేకంగా కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మరియు సైన్స్ ఉ పాధ్యాయులు అదేవిధంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సహకరించిన ఇతర ఉ పాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీరాములు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రామలింగ, బసవరాజు,గిడ్డయ్య, చంద్రశేఖర్ తదితరులు విద్యార్థులను,వారి తల్లిదండ్రులను మరియు ఉపాధ్యాయులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పెద్దపల్లి లో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని : పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయాలనికోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐ ఏర్పాటు చేయడం ద్వారాఈ ప్రాంతంలోని విద్యార్థిని, విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ పొందే అవకాశం కలుగుతుంది. దీని ద్వారా యువతకు మంచి భవిష్యత్తుకు బాటలు పడటంతో పాటు నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.క్లస్టర్ ఐటీఐ ద్వారా వివిధ పారిశ్రామిక రంగాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించి, శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు మరియు ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెద్దపల్లి ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు కూడా నైపుణ్యం కలిగిన స్థానిక యువత అందుబాటులోకి వస్తారు.అందువల్ల పెద్దపల్లి నియోజకవర్గంలో పీఎం సేతు క్లస్టర్ ఐటీఐను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత ఆకాంక్షిస్తున్నారు. పెద్ద పెల్లి ప్రాంతానికి ఈ యొక్క పరిశ్రమములను ను తీసుకురావడానికి కృషి చేస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మరియు పెద్ద పెల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి పెద్దపల్లి పార్లమెంటు ప్రజల తరఫున పి.మల్లికార్జున్ శ్రమ శక్తి అవార్డు గ్రహీత, అనుమాస శ్రీనివాస్ జీన్స్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారికీ ధన్యవాదాలు తెలుపుతున్నాము.

# పూర్తయిన వంతెనకు మళ్లీ శంకుస్థాపన

### – రూ.93 లక్షల అదనపు వ్యయంపై విజిలెన్స్ విచారణకు డిమాండ్
### – పోలీసుల అరెస్టులపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం



పెద్దపల్లి,ఆగస్టు13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఇప్పటికే పూర్తయి ప్రజల వినియోగంలో ఉన్న హై లెవల్ వంతెనకు ఎలాంటి కొత్త పనులు చేపట్టకుండానే అదనపు నిధులతో మళ్లీ శంకుస్థాపన చేయడం తీవ్ర దుమారం రేపుతోంది.ఈ వ్యవహారంపై నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడంపై గురువారం మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హయాంలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4.50 కోట్లతో జాఫర్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలో హై లెవల్ వంతెన నిర్మాణం పూర్తయి,సుమారు రెండున్నరేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంది. అయితే,అదే వంతెన వద్ద ఎలాంటి కొత్త పనులు లేకుండానే రూ.5.43 కోట్ల అంచనా వ్యయంతో మరోసారి శంకుస్థాపన చేయడంపై బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని, అధికారులను పలు ప్రశ్నలు సంధించారు.పనుల్లో ఎలాంటి మార్పులు లేనప్పుడు గత అంచనాతో పోలిస్తే రూ.93 లక్షల అదనపు వ్యయం ఎందుకు పెరిగిందో అధికారులు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని, దీనిపై విజిలెన్స్ శాఖతో పాటు ఆర్అండ్‌బీ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి పాత,ప్రస్తుత అంచనాలు,సాంకేతిక అనుమతులు,మంజూరు ఉత్తర్వులను ప్రజల ముందుంచాలని కోరారు.మరోవైపు, జాఫర్‌ఖాన్‌పేట ఘటనపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం,ప్రభుత్వ నిధుల వినియోగంపై వివరణ కోరడం ప్రజాస్వామ్యంలో హక్కు అని,దాన్ని అణచివేసేలా పోలీసులు వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు.ఈ సమావేశంలో కాల్వ శ్రీరాంపూర్ మండల మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్,మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి,పలు గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,బీఆర్ఎస్ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేత్ర..అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల





పెద్దపల్లి,ఆగస్టు13:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మరణం తర్వాత కూడా తోటి వారికి ప్రాణదానం చేసే గొప్ప అవకాశం నేత్రదానం,అవయవదానమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల అన్నారు.ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని సదాశయ ఫౌండేషన్,తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో గురువారం పట్టణ మున్సిపల్ పరిధిలోని రంగంపల్లి జిల్లా కోర్టు ఆవరణలో నేత్రదానం,అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి సునీత కుంచాల హాజరై మాట్లాడుతూ నేత్రదానం,శరీర అవయవాల దానం పట్ల సమాజంలో ఉన్న అపోహలను తొలగించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.పెద్దపల్లి జిల్లాలోని ఓదెల గ్రామం నేత్రదానంలో ఆదర్శంగా నిలవడం అభినందనీయం.గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు నేత్రదానం చేయాలనే నిర్ణయాన్ని సమిష్టిగా తీసుకున్న ఆ గ్రామస్తుల ఐకమత్యం అందరికీ ఆదర్శమని,ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన భీష్మాచారి కృషిని ఆమె కొనియాడారు.నేత్రదానం అంటే కళ్ళు మొత్తం తీసేస్తారనే అపోహ చాలామందిలో ఉందని,కానీ,అది వాస్తవం కాదని,కేవలం అవసరమైన రెటీనా చిన్న పొరను మాత్రమే తీసుకుంటారని,దీనివల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆమె స్పష్టం చేశారు.అనారోగ్యంతో పాటు ప్రమాదాల్లో బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను సేకరించడం ద్వారా మరో కొంతమంది ప్రాణాలను కాపాడవచ్చని, మరణానంతరం కూడా మనం జీవించే ఉండడానికి ఇదొక ఉత్తమ మార్గమని ఆమె వివరించారు.అవయవదానానికి మనం సిద్ధపడాలంటే,ముందుగా మనం ఆరోగ్యంగా ఉండాలిని,సరైన ఆహారపు అలవాట్లతో జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ,జీవనశైలిని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. అడ్వకేట్ అశోక్ రెడ్డి,ఆయన సతీమణి రమాదేవి తమ శరీరాలను దానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని,వారు సమాజానికి నిలువెత్తు నిదర్శనమని,ఆ దంపతులిద్దరిని శాలువాతో ఘనంగా సత్కరించి ప్రశంసించారు.రాబోయే రోజుల్లో ఒక ప్రత్యేక డ్రైవ్ ద్వారా నేత్రదానాన్ని మరింతగా ప్రోత్సహించాలని,దీనికి బార్ అసోసియేషన్ సభ్యులందరూ పూర్తి సహకారం అందించాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఫోక్సో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచం స్వప్న రాణి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వంగర భవాని,జూనియర్ సివిల్ జడ్జి ఎన్.మంజుల,డీసీపీ భూక్య రామ్ రెడ్డి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్,ఎస్ఐ కే.నరేష్,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల మల్లేశం,సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రావణ్ కుమార్ భీష్మాచారి,పలువురు న్యాయవాదులు,సదాశయ ఫౌండేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ పరిధిలోనే 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతు



హైదరాబాద్ : తెలంగాణ ఓటర్ల జాబితాలో కోటి ఓట్లు గల్లంతయ్యే అవకాశం కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన ముగియడంతో, లక్షలాది మంది ఓటర్ల వివరాలు లభ్యం కాకపోవడం లేదా అన్‌కలెక్టబుల్ , నో మ్యాపింగ్ కేటగిరీల్లోకి చేరడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ ఓట్లు, నివాసాలు మారిన వారు, మరణించిన వారితో పాటు సమాచారం అందించని వారి పేర్లను ఏరివేసే క్రమంలో ఏకంగా కోటి వరకు ఓట్లకు ముప్పు వాటిల్లే అవకాశం కనిపిస్తోంది.ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి వంటి పట్టణ జిల్లాల్లో ఈ ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే దాదాపు 30 నుంచి 40 లక్షల ఓట్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తుండగా, మిగిలిన గ్రామీణ, పట్టణ జిల్లాల్లో సైతం లక్షలాది మంది ఓటర్ల ఆచూకీ లభించలేదని అధికారులు నమోదు చేశారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇళ్లు మారడం, ఒకే కుటుంబ సభ్యులకు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటం, సరైన డోర్ నంబర్లు లేకపోవడం మరియు బీఎల్ఓ ల సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడమే ఈ భారీ వ్యత్యాసానికి ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి.మొత్తంగా 75 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు వెనక్కి రాలేదు. మరో 60 లక్షలకుపైగా ఓటర్ల వివరాల్లో తేడాలున్నాయి. వీరిలో ఇరవై లక్షల వరకూ తేలిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సేకరించిన సమాచారంలో లోపాలు ఉన్న వారిని ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తాత్కాలికంగా మినహాయించే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, నిజమైన ఓటర్లు కూడా ఈ రీ–వెరిఫికేషన్ ప్రక్రియలో భాగం కాకపోవడం వల్ల తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. పోలింగ్ కేంద్రాల మార్పు, చిరునామా సరిగ్గా మ్యాచ్ కాకపోవడంతో శాశ్వతంగా నివాసం ఉంటున్న సామాన్యుల ఓట్లు కూడా అనర్హుల జాబితాలోకి చేరడం పట్ల యంత్రాంగంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ప్రచురిస్తున్న ముసాయిదా జాబితాల ఆధారంగా ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో తక్షణమే తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## రసవత్తరంగా ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ డ్రామా..

హైదరాబాద్ : రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ ఎలక్షన్



ఎండపల్లి, ఆగస్టు 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రం లో గురువారం రోజున జెడ్ పి హెచ్ ఎస్ ఎండపల్లి పాఠశాల లో మాక్ ఎలక్షన్స్ నిర్వహిచడం జరిగింది. దీనిలో భాగంగా పిల్లలకు ఏ విధంగా ఓటు హక్కును వినియోగించు కోవాలో అవగాహన కల్పించడం లో భాగంగా పాఠశాల లో నమూనా ఎన్నికలను నిర్వహించడం జరిగింది. ఈనాటి బాలలే రేపటి పౌరులుగా ప్రజాస్వామ్యం లో భాగం అవుతారు గనుక ఈ ప్రోగ్రాం పాఠశాల లో నిర్వహించడమైందని పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి రవీందర్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు దీనిలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొని ప్రజాస్వామ్య విలువలను విద్యార్థులకు వివరించారు.

## నిద్రలో మంచం పై నుండి పడి వృద్ధుడు మృతి

### - తమ్ముడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ

ధర్మారం, ఆగస్టు 13 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గుండేటి నందయ్య వయస్సు 70 సంవత్సరాలు అను వ్యక్తి నిద్రలో మంచం పై నుండి కింద పడగ, ముసలి వాడు అయినందున, అతనికి భార్య పిల్లలు ఎవరు లేనందున, అతడు అలాగే కింద పడి మరణించాడు అని అతని తమ్ముడి కొడుకు అయినా గుండేటి భీమయ్య గురువారం రోజున ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్సై ఏం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## గజ్జహల్లి హిందూ స్మశాన వాటికలో దారుణ పరిస్థితి

**శవాలను పూడ్చేందుకు స్థలం లేక పాత సమాధులు తవ్వాల్సిన దుస్థితి**

హోలగుంద : మండల పరిధిలో గజ్జెహల్లి గ్రామంలోహిందువుల దహన, అంత్యక్రియల కోసం వినియోగిస్తున్న గజ్జహల్లి గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో స్థలం కొరత తీవ్ర సమస్యగా మారింది. ప్రస్తుతం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి అంత్యక్రియల అనంతరం మృతదేహాన్ని పూడ్చేందుకు సరైన స్థలం లేకపోవడంతో గతంలో పూడ్చిన మృతదేహాల సమాధులను తిరిగి తవ్వి, అక్కడే కొత్త మృతదేహాన్ని పూడ్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏళ్లుగా స్మశాన వాటికకు సరిపడా స్థలం లేకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఒక కుటుంబ సభ్యుడిని పూడ్చిన స్థలాన్ని కొంతకాలం తర్వాత మరో మృతదేహం కోసం తిరిగి తవ్వాల్సి రావడం తీవ్ర మనోవేదనకు గురిచేస్తోందని గ్రామస్తులు అంటున్నారు. మృతులకు కనీస గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలిగ్రామంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత స్మశాన వాటిక స్థలం ఏమాత్రం సరిపోవడం లేదని, ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అదనంగా స్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుల అంత్యక్రియలు గౌరవప్రదంగా నిర్వహించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికే గ్రామ సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అదనపు స్థలం కేటాయించి, గజ్జహల్లి హిందూ స్మశాన వాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ అధ్యక్షుడిగా ఖాజీ ముతహిర్ జామయీ ఎన్నిక

హోలగుంద : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమియత్ అహ్లె హదీస్ మరియు కర్నూలు జిల్లా జమియత్ అహ్లె హదీస్ ఆధ్వర్యంలో కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ నూతన బాధ్యుల ఎన్నిక నిర్వహించబడింది.ఈ ఎన్నికలో ఖాజీ ముతహిర్ జామయీ హఫిజహుల్లాహ్ కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ అధ్యక్షుడిగా, హాఫిజ్ మంజూర్ ఉపాధ్యక్షులు, అబ్దుల్ జలీల్ ట్రెజరర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జమియత్ బాధ్యులు, సభ్యులు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉ పాధ్యక్షులు మరియు ట్రెజరర్ లకు అభినందనలు తెలిపారు. వారి నాయకత్వంలో కర్నూలు నగర జమియత్ అహ్లె హదీస్ సంస్థ ఏక దైవారాధన పట్ల విస్తృత అవగాహన కల్పించుట,విద్య సంస్కరణ మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుకుగా సేవలుఅందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.నూతన బాధ్యులు జమియత్ ఆశయాలు, నియమ నిబంధనలకు అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఖుర్ఆన్ మరియు సున్నత్ సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.చివరగా, నూతనంగా ఎన్నికైన బాధ్యులు తమ బాధ్యతలను నిజాయితీ, అంకితభావం మరియు ఇఖ్లాస్‌తో నిర్వర్తిస్థామని సభాముఖంగా తెలియజేస్తూ, ఇంతటి మహత్తర అవకాశాన్ని కల్పించినందుకు సాదర కృతజ్ఞతలు తెలిపారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభం

చాగలమర్రి : రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు అంగన్వాడి టీచర్లకు ఐ సి డి ఎస్ నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శేషశైనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవయ్య, సూపర్వైజర్ సుశీల పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈసీసీ జాతీయ విద్యా విధానం, శిశు అభివృద్ధి, పౌష్టికాహారం, ఆరోగ్య విద్యపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి అంగన్వాడి టీచర్లు హాజరయ్యారు.

## అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్య

నిజామాబాద్: నిజామాబాద్ జిల్లా కేంద్రం వినాయకనగర్ లో అప్పుల బాధ తాళలేక నరేష్, మేఘన దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రుల మృతితో వారి ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మారగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు భర్త నరేష్ ఊరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా, భార్య మేఘన నిద్రమాత్రలు మింగి తాగి ఆత్మహత్య చేసుకుంది. మేఘన, నరేష్ కు 8 ఏళ్లు కొడుకు, 6 ఏళ్లు బాబు వున్నారు. ఇద్దరు పిల్లలను మేనత్త వద్ద వదిలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య కు పాల్పడ్డారు. పక్క ప్లానింగ్ తో చనిపోదాం అని భార్యాభర్తలు చేసుకున్నట్లు అనుమానం. బంధువులు అప్పుల బాధనే ఆత్మహత్యకు గల కారణాలు అంటున్నారు.భర్త నరేష్ కరెంట్ డిపార్ట్ మెంట్ లో విధులు నిర్వహిస్తున్నాడు.

## అమెరికాలో హన్మకొండ జిల్లా విద్యార్థి మృతి

### - 15 రోజులుగా మృత్యువుతో పోరాడి కన్నుమూత

హన్మకొండ : అమెరికాలోని ఫ్లోరిడాలో జూలై 25వ తేదీన జరిగిన అగ్నిప్రమాదంలో 75% కాలిన గాయాలతో ఆసుపత్రిలో చేరిన హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం గంటూర్పల్లికి చెందిన భరత్ చందర్ రెడ్డి అనే విద్యార్థి మృతి చెందాడు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులు ఉన్నత చదువుల కోసం కొడుకును 2023లో అమెరికా పంపారు. అమెరికా నుంచి తిరిగి వచ్చి వివాహం చేసుకుందాం అనుకునే సమయానికి అనుకోని ప్రమాదంలో మృతి చెందాడు.

# డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు

**- ఆర్మూర్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్**

**- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి**

**- పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**

**- చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరమంగా దాడులు నిర్వహణ , అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**

**- డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి - రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**




**నిజామాబాద్, (ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మూర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్. సమగ్ర సమీక్ష సమావేశం నందిపేట్ పోలీస్ స్టేషన్ యందు నిర్వహించగా ఆర్మూర్ డివిజన్ ఏ.సీ.పీ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,ఎస్.హెచ్.ఓ లు ,ఎస్సైలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గారు మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని , అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు,మహిళలపై నేరాలు,సైబర్ మోసాలు,డ్రగ్స్ మరియు గంజాయి అక్రమ రవాణా , పేకాట,గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు,పాత నేరస్తులు,బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,షీ టీమ్స్,ఈగల్ టీమ్స్,చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే పేకాట , గుట్కా,ఇసుక మరియు ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.రిసెప్షన్ నిర్వహణ,రికార్డుల నిర్వహణ,స్టేషన్ పరిశుభ్రత మరియు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి,నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని , ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం,రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే మరియు స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు.

డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని,వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్మూర్ ఏ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య ,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి,సీ.ఐలు మరియు ఎస్హెచ్ఓలు మరియు ఎస్సై,ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## యువత దేశం కోసం ధర్మం కోసం సమయం ఇవ్వాలి

**- ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల సమ్మేళనంలో వక్తల పిలుపు**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ప్రజా కలం : ప్రస్తుత సమాజంలో యువకులు దేశం కోసం ధర్మం కోసం సమయం ఇవ్వాలని విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర పూర్వ విద్యార్థి పరిషత్ సంయోజక్ రెడ్డి గారి హరిస్మరణ్ రెడ్డి అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని స్నేహ బంకేట్ హాల్లో జరిగిన ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల సమ్మేళనం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశం లో యువత అధిక సంఖ్యలో ఉన్నారని వారి వల్ల దేశం ఎంతో అభివృద్ధి చెందుతుంది అన్నారు. ఈ క్రమంలోనే యువకులు దేశం కోసం ధర్మం కోసం సమయం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువకులు మేలుకొని దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కామారెడ్డి జిల్లా సహ కార్యవాహ్ లో రెడ్డి సాయిలు, ఎల్లారెడ్డి బజరంగ్దళ్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## కామారెడ్డిలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

**- పాల్గొన్న ఎమ్మెల్యే కె.వి.ఆర్**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ప్రజా కలం : కామారెడ్డి పట్టణంలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు.



ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి జాతీయ జెండా పట్టుకొని బిజెపి నాయకులు, కార్యకరలతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో నడిచారు. పట్టణం లోని గాంధీ గంజ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ జేపీఎన్ రోడ్, సుభాష్ రోడ్, ధర్మశాల, ఇందిరాచౌక్, రైల్వే కమాన్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు కొనసాగింది. నిజాంసాగర్ చౌరస్తాలో జాతీయ గీతాలాపన చేసి ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, బీజేపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల లభ్యత యాప్‌పై రైతులకు అవగాహన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13: ముప్కాల్ మండలంలోని నల్లూరు గ్రామంలో రైతులకు 'ఫార్మ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్' యాప్‌పై గురువారం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)



స్నేహలత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ మొబైల్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓపెన్ చేయడం ద్వారా డీఏపీ, యూరియా, పొటాష్ వంటి ఎరువులు ఏయే కేంద్రాల్లో, ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయో సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఇలాంటి సరికొత్త సాంకేతిక సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన అధికారులకు సన్మానం

మల్కాజిగిరి ఆగస్టు 13(ప్రజా కలం ప్రతినిధి) శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేసిన వివిధ శాఖల అధికారులను మల్కాజిగిరి 183 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జీడి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఏసీపీ యాదగిరి రెడ్డి, సీఐ విజయ్ కుమార్, మున్సిపల్ శాఖ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, విద్యుత్ శాఖ ఏఈ గోపాల్ తదితర అధికారులను కలిసి సన్మానించారు.బోనాల ఉత్సవాలు సక్రమంగా, ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన డివిజన్, నియోజకవర్గ ప్రజలకు జీడి సంపత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మైనంపల్లి హనుమంతరావు సహకారంతో మల్కాజిగిరి డివిజన్‌తో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేష్ గౌడ్, గౌసుద్దిన్ భాయ్, మహేందర్ గౌడ్, భాస్కర్,నగేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మల్కాజిగిరి అధ్యక్షులు జీడి చరణ్జిత్ గౌడ్, సంజయ్,రవీందర్, కుమార్ గౌడ్,పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**రోడ్డెక్కిన ఉపాధ్యాయులు.. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి**

**సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం**

**: ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక**



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13: నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధ్యాయ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం భీంగల్‌లో యూఎస్పీసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భీంగల్ తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విద్యారంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని అస్పష్టమైన, అసంబద్ధ నిర్ణయాల కారణంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.బోధనేతర ఆన్‌లైన్ పనులు, పాఠశాల సమయాల్లో నిరంతర శిక్షణ కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులు తరగతి గది బోధనకు దూరమవుతున్నారని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి 2023 జూలై 1 నుంచి అమలు చేయాలి.

పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల డీఏలను తక్షణమే విడుదల చేయాలి.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలి.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఆప్షన్ కల్పించాలి.

పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

27 వేల పాఠశాలలను 4 వేలకు కుదించే ఆలోచనను విరమించుకోవాలి.

జీవో ఎంఎస్ నం.25ను సవరించి ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలి.

అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ఆగస్టు 15లోపు విడుదల చేయాలి.

ఈహెచ్ఎస్‌ను బలోపేతం చేసి ఉపాధ్యాయులు, ఉద్యోగులందరికీ మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించాలి.

సమగ్ర శిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్ తదితర కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం బేసిక్ పే వర్తింపజేయాలి.

జీవో 317 కారణంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వెంటనే వారి సొంత జిల్లాలకు బదిలీ చేసి న్యాయం చేయాలి.

ప్రభుత్వం తమ డిమాండ్లపై తక్షణమే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో భారీ ధర్నాలు,ఆగస్టు 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని చేపడతామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.మల్లేష్,డీటీఎఫ్ జిల్లా నాయకులు జి.ఈశ్వర్,ఎస్సీ, ఎస్టీయూ జిల్లా నాయకులు పి.లింగయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.జనార్ధన్, డీటీఎఫ్ జిల్లా నాయకులు ఏ.రమేష్‌తో పాటు టి.శ్రీనివాస్, కే.సత్యనారాయణ, ఎస్.భూమేశ్వర్, ఎస్.అశోక్, ఎస్.తిరుపతిగౌడ్, వై.భూమేశ్వర్, టి.ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పేరుతో బెదిరింపులు ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ప్రజా కలం : జర్నలిస్టుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు జర్నలిస్టులను గురువారం అరెస్టు చేసినట్లు కామారెడ్డి డి.ఎస్.పి మధుసూదన్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న శిరీష అనే మహిళా ఉద్యోగి ఆత్మహత్య కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగం, జీతం, సర్వీస్ వివరాలను ఆర్టీఐ ద్వారా సేకరించి, ఉద్యోగం కోల్పోయేలా



చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేసి మానసికంగా వేధించినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని పేర్కొన్నారు. దీంతో కేసును ఆత్మహత్యకు ప్రేరేపణ కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో ఏ2గా ఇందూరి సిద్దాగౌడ్, ఏ3 లాండే భాస్కర్‌లను గురువారం కామారెడ్డి ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, నేరానికి సంబంధించిన కీలక విషయాలను వెల్లడించినట్లు ఆయన తెలిపారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు తమను జర్నలిస్టులుగా పరిచయం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వ్యక్తులను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడైందన్నారు. వారిపై ప్రతికూల వార్తలు ప్రచురిస్తామని, అధికారులకు ఫిర్యాదులు చేస్తామని, ఉద్యోగాలు పోయేలా చేస్తామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆధారాలు లభించాయన్నారు. ఇలాంటి బెదిరింపులు, డబ్బుల వసూళ్లకు సంబంధించి కామారెడ్డి, ఎల్లారెడ్డి, దోమకొండ, గాంధారి, దేవునిపల్లి పోలీస్ స్టేషన్లలో గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. ప్రస్తుత కేసులో కూడా ఇదే విధమైన పద్ధతిలో సదరు మహిళపై ఒత్తిడి, బెదిరింపులు, మానసిక వేధింపులకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఈ సమావేశంలో కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర సత్యాగ్రహం

**- కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 ప్రజా కలం : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పాదయాత్ర, సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పేర్కొన్నారు. హల్ద్వానీలో కాంగ్రెస్ ర్యాలీ జరిగిన ప్రదేశాన్ని గంగాజలంతో శుద్ధీ చేసిన ఘటనను ఖండిస్తూ ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సంఘీభావంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ పాదయాత్ర, సత్యాగ్రహాన్ని విజయవంతం చేయాలని కోరారు.





# రూ.30 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

## అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది :మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

కుత్బుల్లాపూర్ రంగారెడ్డి నగర్ డివిజన్ లోని రంగారెడ్డినగర్ లో రూ.30 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాలనీల్లో రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు రూ.30లక్షల నిధులు మంజూరు చేసి విడుదలకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ప్రాథమిక అవసరాలను పట్టించుకోకుండా, అనేక ప్రాంతాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కూన శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను గత పాలకులు విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తూ పనులను చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కూన శ్రీశైలంగౌడ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతే శ్రీనివాస్ యాదవ్, జి రమేష్, బాలరాజు, రమేష్ మంజూల్కర్, కాజాబాయ్, తిమ్మయ్య, పురుషోత్తం, మాధవి, నయీమ్, ఆనంద్ గౌడ్, షకీర్, మల్లం శ్రీను, నారాయణ, రాకేష్, జ్ఞానేశ్వర్ రెడ్డి, తోకలా శ్రీనివాస్, శ్యామల, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# తిమ్మాపూర్‌లో మిన్నంటిన స్వాతంత్ర్య సంబరాలు

## ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే 5వేల జరిమానా: గ్రామసభ తీర్మానం

## తడి, పొడి చెత్త వేరుచేయడంపై ప్రజలకు అవగాహన



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13:

మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పుప్పాల నరేష్ అధ్యక్షతన గ్రామస్తులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' లక్ష్యంతో గ్రామంలోని ప్రతి ఇంటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని సర్పంచ్ కోరారు.

స్వచ్ఛ తిమ్మాపూర్ దిశగా అడుగులు..వేడుకలతో పాటు గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెత్తను తడి, పొడి, సానిటరీ, మరియు ప్రత్యేక జాగ్రత్త చెత్తగా 4 రకాలుగా వర్గీకరించి పంచాయతీ సిబ్బందికి అందించే విధానాన్ని ప్రజలకు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు ప్రకటించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ వాడిన వారికి రూ. 5,000/- భారీ జరిమానా విధించనున్నట్లు గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించిందని సర్పంచ్ తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ తూచా తప్పకుండా అమలు చేస్తోందని పాలకవర్గం స్పష్టం చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా, క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందేలా పారదర్శకంగా కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సదానంద్, పంచాయతీ కార్యదర్శి బాస నరేందర్, వార్డు సభ్యులు, వివిధ శాఖల గ్రామ స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అవయవదానం.. కొత్త జీవితానికి నాంది

- దాతల ఉదారత ఎంతో విలువైనది
- అపోహలను తొలగించాలి.. అవగాహన పెంచాలి
- మీడియా కీలక పాత్ర పోషించాలి: డాక్టర్ భూషణ్‌రాజు




హైదరాబాద్, ఆగస్టు 13 (ప్రజాకలం) :

అవయవదానం మరో వ్యక్తికి కొత్త జీవితాన్ని ప్రసాదించే గొప్ప కార్యమని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) నెఫ్రాలజీ విభాగం ప్రొఫెసర్, అధిపతి, ఎస్‌వోటీటీవో (జీవన్‌దాన్) విభాగాధిపతి డాక్టర్ శ్రీ భూషణ్‌రాజు అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో 'అవయవదానం: అపోహలు--వాస్తవాలు' అంశంపై 'వార్త' పేరిట మీడియా కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ భూషణ్‌రాజు అవయవదాన ఆవశ్యకతను వివరించారు.

**దాతల ఉదారతే కీలకం**

మరణించిన వ్యక్తి మరో వ్యక్తికి జీవితాన్ని అందించగలగడం అవయవదానంలోని గొప్పతనమని ఆయన పేర్కొన్నారు. వైద్యశాస్త్రం అవయవ మార్పిడిలో ఎంతో పురోగతి సాధించినప్పటికీ.. మానవ అవయవాలను పూర్తిగా కృత్రిమంగా పునఃసృష్టించడం ఇంకా సాధ్యం కాలేదన్నారు. అందువల్ల అవయవదాతలు, వారి కుటుంబాల ఉదారత ఎంతో అమూల్యమైనదని తెలిపారు. మార్పిడి చేసిన అవయవాన్ని రోగనిరోధక వ్యవస్థ సహజంగానే పరాయిదిగా గుర్తించి తిరస్కరించే ప్రయత్నం చేస్తుందని వివరించారు. ఆధునిక వైద్య విధానాలతో ఈ ప్రతిస్పందనను నియంత్రించడం సాధ్యమైనప్పటికీ.. అవయవ తిరస్కరణను నివారించడం, గ్రహీతను ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడటం మధ్య సమతుల్యత కొనసాగించడం సవాలుగా ఉందన్నారు.

**డిమాండ్--సరఫరా మధ్య భారీ అంతరం**

అవయవ మార్పిడి విజయానికి ప్రధానంగా అవయవాల లభ్యతే కీలకమని డాక్టర్ భూషణ్‌రాజు అన్నారు. అధునాతన మార్పిడి విధానాలు, ఔషధాలు అందుబాటులోకి వచ్చినా.. అవయవాలను కర్మాగారాల్లో తయారు చేయడం సాధ్యం కాదన్నారు. అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగులకు కొత్త జీవితాన్ని అందించాలంటే దానం ఒక్కటే కీలక మార్గమని తెలిపారు.

దేశంలో అవయవ మార్పిడికి ఉన్న డిమాండ్‌కు, అందుబాటులో ఉన్న అవయవాలకు మధ్య గణనీయమైన అంతరం ఉందని పీఐబీ హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ (ఐఐఎస్) అన్నారు. అవయవదానం, మార్పిడి ప్రక్రియలను సమన్వయం చేయడంలో ఎన్‌వోటీటీవో, ఎస్‌వోటీటీవోలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

**స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కీలకం**

కుటుంబ సభ్యులు అవయవ దానానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. వైద్యపరంగా అవయవాలు సరిపోలని సందర్భాల్లో 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంటేషన్' కీలకమైన ప్రత్యామ్నాయమని డాక్టర్ భూషణ్‌రాజు వివరించారు. చట్టపరమైన, వైద్యపరమైన నిబంధనలకు అనుగుణంగా సరిపోలే దాత--గ్రహీత జంటలను పరస్పరం అనుసంధానించవచ్చన్నారు. అవయవదానాన్ని కేవలం వైద్యపరమైన అంశంగా కాకుండా సామాజిక అంశంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబాల్లో, సమాజంలో అవయవదానంపై బహిరంగ చర్చలు జరగాలని సూచించారు. అపోహలు, తప్పుడు అభిప్రాయాలను తొలగించడంలో మీడియా కీలక పాత్ర పోషించగలదని పేర్కొన్నారు.

**అవగాహన పెంచాలి**

అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు.. శాస్త్రీయ సమాచారంతో కూడిన చర్చలను విస్తృతంగా నిర్వహించాలని కార్యశాల పిలుపునిచ్చింది. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని అవయవదానానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

**'జుగ్ జుగ్ జియో' ఉద్యమం**

దేశంలో అవయవదానం, మార్పిడి కార్యక్రమాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. స్వచ్ఛంద కుటుంబ చర్చలు, అవయవదాన ప్రతిజ్ఞలను ప్రోత్సహించేందుకు నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ (ఎన్‌వోటీటీవో) 'జుగ్ జుగ్ జియో (అంగ్‌దాన్ కరో, జుగ్ జుగ్ జియో)' ఉద్యమాన్ని ప్రారంభించింది. అవగాహన పెంచడం, అవయవదానాన్ని ప్రోత్సహించడం, దేశవ్యాప్తంగా అవయవ మార్పిడి వ్యవస్థను బలోపేతం చేయడం దీని లక్ష్యం.

# గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ
- ఇద్దరు మహిళలు దుర్మరణం , మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- సంఘటన స్థలానికి పర్యవేక్షణ చేసిన పోలీస్ కమిషనర్






నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13: తీర్థయాత్రకు బయలుదేరిన భక్తులకు ఆర్మూర్ మండల పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జాతీయ రహదారిపై టైర్ పంచర్ కావడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు హైదరాబాద్‌లోని చిన్న జీయర్ స్వామి దర్శనం కోసం రెండు టూరిస్ట్ బస్సుల్లో తీర్థయాత్రకు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి చేరుకున్న సమయంలో ముందుగా వెళ్తున్న టూరిస్ట్ బస్సు ం+ 01 ు 1864 టైర్ పంచర్ కావడంతో రెండు+ 21 ు 2172 బస్సులను జాతీయ రహదారిపై నిలిపివేశారు. టైర్ పంచర్ కావడంతో బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి , రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ +ు 27 ుఖీ 7482 డ్రైవర్ ఆగి ఉన్న టూరిస్ట్ బస్సును సకాలంలో గుర్తించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. లారీ ఢీకొట్టడంతో ఆగి ఉన్న టూరిస్ట్ బస్సు ముందుకు కదిలి , డివైడర్ ప్రాంతంలో కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సుజాత ( 54 ) , మాధవి ( 47 ) అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు ప్రయాణికులు సునీత , చిటక్కలకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ ఉన్న ఇతర ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ కమిషనర్

ఘటన సమాచారం అందుకున్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్. సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు , వాహనాలు ఏ విధంగా నిలిపి ఉన్నాయనే అంశాలతో పాటు లారీ ఢీకొన్న తీరును అధికారులు కమిషనర్‌కు వివరించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ , క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన విధానం తదితర అంశాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని , వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలా చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం జాతీయ రహదారులపై వాహనాలు టైర్ పంచర్ కావడం, సాంకేతిక లోపాలు ఏర్పడటం వంటి సందర్భాల్లో వాహనాలను రహదారిపై నిలిపినప్పుడు అత్యంత జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా వాహనంలోని ప్రయాణికులు రహదారిపైకి వచ్చి డివైడర్లు లేదా రహదారి పక్కన కూర్చోవడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. వాహనం ఆగిపోయిన వెంటనే ప్రమాద హెచ్చరిక లైట్లు ఆన్ చేయడంతో పాటు, తగిన దూరంలో రిఫ్లెక్టివ్ వార్నింగ్ ట్రయాంగిల్స్ లేదా ఇతర హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయాణికులు కూడా రహదారిపై కాకుండా సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి లారీ డ్రైవర్ నిర్లక్ష్యం , అతివేగం తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎ.సి.పి వెంకటేశ్వర్ రెడ్డి , ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ, ఆర్మూర్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్ కుమార్,ఆర్మూర్, జక్రాన్ పల్లి, బాల్కొండ ఎస్సైలు మరియు అసిస్టెంట్ ఎం.వి.ఐ తదితరులు పాల్గొనడం జరిగింది.

# సంకేట్ బడిలో 'ఫ్రీడమ్ 3K రన్' ఘనం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 13:

విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని మోర్తాడ్ మండల పరిధిలోని సంకేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది సంతోష్ కుమార్ అన్నారు. గురువారం పాఠశాల ఆవరణలో 'ఫ్రీడమ్ 3ఖ రన్'ను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త, మాజీ పార్లమెంట్ సభ్యులు కీ.శే. యం.నారాయణరెడ్డి (పండిత్) జ్ఞాపకార్థం, షీలా రెడ్డి ఆర్థిక ప్రోత్సాహంతో (రూ. 40 వేల వ్యయంతో) ఈ పరుగు పందెం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ మాక్లూర్ వనజ నర్సా గౌడ్ పచ్చజెండా ఊపి పరుగును ప్రారంభించారు.




ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పరుగు కేవలం గెలుపు కోసమే కాదని, ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రతీక అని పేర్కొన్నారు. నేటి యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కందుకూరి వీరేశలింగం గారి సూక్తులను గుర్తుచేస్తూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమర్థులైన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన అందరికీ హెచ్‌ఎం సంతోష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలో విషాదం.. విద్యార్థిని మృతి

- వేపచెట్టు కొమ్మ విరిగిపడి పలువురు విద్యార్థులకు గాయాలు
- అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆరోపణలు..
- మృతురాలి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్



**భువనగిరి పట్టణం, ఆగస్టు 13 (ప్రజా కలం):** భువనగిరి జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద ఉన్న బగాయత్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విషాదం చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆటలు ఆడుతున్న సమయంలో వేపచెట్టు కొమ్మ ఒక్కసారిగా విరిగిపడటంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మూడో తరగతి విద్యార్థిని అలీమ (8) మృతిచెందింది. కొమ్మ విరిగిపడటంతో విద్యార్థులు భయంతో పరుగులు తీయగా.. ఉపాధ్యాయులు వెంటనే స్పందించి గాయపడిన వారిని భువనగిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న నలుగురు విద్యార్థులను వైద్యుల సూచన మేరకు బీబీనగర్ ఎయిమ్స్‌కు తరలించారు. హర్షిత్‌తో పాటు మరో విద్యార్థి కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు.

**మంటలతో బలహీనపడిన చెట్టు?**

భువనగిరి బగాయత్ పాఠశాల ఆవరణలో ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ కూడా ఉన్నాయి. అయితే ప్రాంగణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత వారం కొందరు తాగుబోతులు వేపచెట్టుకు నిప్పంటించగా.. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పినట్లు చెబుతున్నారు. చెట్టు కాలిపోవడంతో లోపల తొర్ర ఏర్పడి బలహీనపడిందని, అందువల్లే కొమ్మ విరిగిపడినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోకి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు వస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముందస్తుగా చెట్టును పరిశీలించి ప్రమాదకరంగా ఉన్న కొమ్మలను తొలగించి ఉంటే ఈ విషాదం తప్పేదని అంటున్నారు.

**రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి**



చెట్టు కొమ్మ విరిగిపడి మృతి చెందిన మూడవ తరగతి విద్యార్థి అలీమ

పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతూ మృతి చెందిన మూడో తరగతి విద్యార్థిని అలీమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. అలీమ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఘటనకు కారణమైన నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



# అక్రమ గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

- కిలోన్నర గంజాయి, బైక్ సీజ్....
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన...
- కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్....

మల్హర్, ఆగస్టు 13 ప్రజాకలం ప్రతినిధి...

పక్క రాష్ట్రాల నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్న ఇద్దరు యువకులను కొయ్యూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీగా గంజాయిని, రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాడిచర్లకు చెందిన బుర్ర శివ సాయికుమార్ (19, విద్యార్థి), అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దామ ప్రశాంత్ (22, వ్యవసాయం)లు కలిసి పల్సర్ బైక్ (TG 22 8338) పై తాడిచర్ల నుండి కొయ్యూరు వైపు గంజాయి తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో బుధవారం సాయంత్రం నాగులమ్మ గుడి వద్ద మాటువేసిన కొయ్యూరు పోలీసులు వీరిని పట్టుకుని వారి నుంచి 1.160 కిలోల గంజాయి, పల్సర్ బైక్, రెండు సెల్ ఫోన్లను పంచుల సమక్షంలో సీజ్ చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి గురువారం ఉదయం రిమాండ్‌కు తరలించినట్లు కొయ్యూరు ఎస్ఐ పి మహేందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగ కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో గంజాయి విక్రయించే వారిపై, సేవించే వారిపై నిఘా ఉంచామని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి గంజాయి దందాకు పాల్పడితే కఠిన చర్యలతో పాటు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

### ఇసుక అక్రమ తవ్వకాలు,రవాణా నియంత్రణకు

# పటిష్ట చర్యలు తీసుకోవాలి

## =జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్ ఆగస్టు 13 (ప్రజాకలం) :** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు తహసీల్దార్లు అప్రమత్తంగా వ్యవహరించి, సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు.

గురువారం తహసీల్దార్లతో నిర్వహించిన వెబెక్స్ సమీక్షలో అన్ని మండలాల తహసీల్దార్లతో అక్రమ ఇసుక తవ్వకాలపై, భూభారతి, సదాబైనమా, మీసేవ, ప్రజాపాలన, కుటుంబ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పై, ఆగస్టు 15 న స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పై సమగ్రంగా చర్చించారు.

ముఖ్యంగా కోయిల్‌కొండ, మూసాపేట, మిడ్జిల్, దేవరకద్ర, చిన్నచింతకుంట, జడ్చర్ల తదితర మండలాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపుపై వచ్చిన ఫిర్యాదులు, నివేదికలను కలెక్టర్ సమీక్షించారు. కోయిల్‌కొండ మండలం శివారం గ్రామంలో ఇసుక తవ్వకాల కారణంగా ప్రభుత్వ భూమికి నష్టం జరిగినట్లు వచ్చిన నివేదికపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

మిడ్జిల్ మండలం లో సీజ్ చేసిన ఇసుక వేలం వెంటనే నిర్వహించాలని మైనింగ్ శాఖా అధికారులను, తహశీల్దారు ఆదేశించారు .

క్షేత్రస్థాయిలో జరిగిన నష్టాన్ని సంబంధిత తహసీల్దార్లు స్వయంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని, అక్రమంగా తరలించిన ఇసుక వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నిబంధనల ప్రకారం బాధ్యుల నుంచి రికవరీ చేయాలని సూచించారు. అవసరమైన చోట పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేసి, అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

మీడియాలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు సంబంధిత తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి, తీసుకున్న చర్యలను తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అనే విషయాన్ని తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పరిస్థితిని స్వయంగా తెలుసుకోవాలని ఆదేశించారు.

అధికారులు ఒకరిపై మరొకరు బాధ్యతలు బదిలీ చేసుకునే పరిస్థితి ఉండకూడదని, తమ పరిధిలో జరుగుతున్న ప్రతి అంశంపై తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సమాచారం అందిన వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయడం, ఇసుకను స్వాధీనం చేసుకోవడం, నష్టాన్ని అంచనా వేసి రికవరీ చర్యలు చేపట్టడం వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు,ఇందుకు సంబంధించి తహశీల్దార్లు ప్రతిమండలనుండి 10 నుండి 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి ఆ జాబితాను వెంటనే పంపాలని అన్నారు.

అనంతరం జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి, లబ్ధిదారుల ఎంపిక, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సమీక్ష నిర్వహించారు. టూ-బీహెచ్‌కే గృహాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి, పెండింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్-1 జాబితాలోని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారి వివరాలను హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ప్రజాపాలన పోర్టల్‌లోని దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుని అర్హులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలుగా గుర్తించాలని తెలిపారు. గృహాల కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు, వర్గాల వారీ రిజర్వేషన్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం



చేశారు.

పెండింగ్‌లో ఉన్న గృహాల ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత హౌసింగ్ పీడీ కార్యాలయానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పరిష్కరించి, గృహాల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భూభారతి, సాదాబైనమా, రీసర్వే, నక్షా సర్వే, మీసేవ, కుటుంబ రిజిస్ట్రేషన్ల పై తదితర రెవెన్యూ సేవలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి, ప్రతి పనిలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. భూభారతి పోర్టల్‌లో 60 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లకు ఆదేశించారు. సర్వేయర్ల కొరత, కోర్టు కేసులు, సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిపోయిన దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి సాధ్యమైన వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ల్యాండ్ యాప్‌లోని జీపీఎస్ కోఆర్డినేట్ల ఆధారంగా స్కెచ్‌లు సిద్ధం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పెండింగ్ ఫైళ్లపై నిరంతరం ఫాలోఅప్ చేయడంతో పాటు, కోర్టు కేసులకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పూర్తి వివరాలతో పంపాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ పనులు కొనసాగుతున్నప్పటికీ భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన కేసులను లిఖితపూర్వకంగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని, ప్రతి మండలంలో పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో చేపడుతున్న గ్రామాల రీసర్వే పనులను వేగవంతం చేస్తూ గ్రామ సరిహద్దుల నిర్ధారణ, ప్రభుత్వ భూముల డిమార్కేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.

కుటుంబ రిజిస్ట్రేషన్లకు సంబంధించి దరఖాస్తులను కూడా వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఐతే చనిపోయిన వారి వివరణను జాగ్రత్తగా పరిశీలించి కుటుంబ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలను జారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, డి. ఆర్.ఓ ఎ.నిర్మల, ఆర్. డి.ఓ నవీన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ. డి అశోక్, జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, మండల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# గోపి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

మేడిపల్లి ఆగస్టు 13(ప్రజాకలం న్యూస్)

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు వి.గోపి నాయక్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ



ర్యాలీలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ జిల్లా ఎస్టీ మోర్చా ఇంచార్జ్ బానోత్ పద్దియ్యా నాయక్, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే కోడి మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పండరీనాథ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా రాజేశ్వర్, మాజీ కంటెస్టెడ్ కార్పొరేటర్ శీనన్న, ఓబీసీ మోర్చా విజయ్,జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవి,గంజి వేణు పాల్గొన్నారు. ఎస్టీ మోర్చా స్పోక్స్‌పర్సన్ కృష్ణ నాయక్, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్,సాయి, కిరణ్,జగ్గు,బూత్ అధ్యక్షుడు రాకేష్ నాయక్, డివిజన్ జనరల్ సెక్రటరీ నరేష్, జిల్లా ట్రెజరర్ ఎస్.రఘు కుమార్,రాష్ట్ర ఎస్సీ మోర్చా సురేష్ తదితరులు పాల్గొన్నారు.




# నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

### సామాజిక సేవలో సామాన్య ప్రజలకు ఉచిత వైద్య సేవలు: గోగులపాటి కృష్ణమోహన్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

మేడ్చల్ జిల్లా, సుభాష్ నగర్ డివిజన్, సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో నా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా సీఎంఆర్ హాస్పిటల్, కండ్లకోయ వారి సౌజన్యంతో నా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు, నా ఫౌండేషన్, నా టీవీ వ్యవస్థాపకులు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ... సాహిత్యస్య వికాసాయ, రక్షణాయ చ సంస్కృతేః । సామాజిక హితార్థాయ, నా సంస్థా వర్తతే చిరం ॥"లిలి అనే ధ్యేయంతో సాహిత్య వికాసం, సామాజిక శ్రేయస్సు, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలుగా నా ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక సేవ, సాహిత్య వికాసం, సాంస్కృతిక పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నా ఫౌండేషన్ తన వంతు కృషి చేస్తుందని తెలిపారు. సామాన్య ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో, కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరంలో సుమారు 100 మంది వరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యుల సూచనల మేరకు 25 మందికి



రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైద్య సేవలు పొందిన వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో డిసబుల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్య, సీఎంఆర్ హాస్పిటల్ పీఆర్వో దుర్గాప్రసాద్, గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సలహాదారు రమేష్ సర్వేపల్లి, సంఘం సభ్యులు గడ్డం రాంబాబు, శ్రీధరాచార్యులు, నరేందర్ రెడ్డి, యాదయ్య, రాము, శేఖర్ గౌడ్, సీఎంఆర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రవల్లిక, కోఆర్డినేటర్ రాజ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.



# నడిగడ్డలో జనసేన జెండా ఎగరేస్తాం : బాసు చిన్న తిమ్మప్ప

గద్వాల ప్రతినిధి ఆగస్టు 13ప్రజా కలం

రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని, నడిగడ్డలో జనసేన జెండా ఎగరవేస్తామని గద్వాల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బాసు చిన్న తిమ్మప్ప స్పష్టం చేశారు. గద్వాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని, ప్రతి గ్రామంలో జనసేన పార్టీని బలోపేతం చేసి పార్టీ జెండాను ఎగురవేస్తామని పేర్కొన్నారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజల కోసం పనిచేస్తామని బాసు చిన్న తిమ్మప్ప అన్నారు. నడిగడ్డ ప్రాంతంలో జనసేన కార్యకర్తలను ఎవరైనా భయపెట్టినా, బెదిరింపులకు గురిచేసినా కార్యకర్తలకు అండగా నిలిచి, వారి తరఫున జనసేన పార్టీగా పోరాడుతామని హామీ ఇచ్చారు. జనసేన కార్యకర్తలు, అభిమానులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రజల కోసం ధైర్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో గద్వాల నియోజకవర్గంలో జనసేన పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని బాసు చిన్న తిమ్మప్ప కోరారు.






# సర్ ప్రోగ్రాం విజయవంతం చేసిన బిఎల్ఓలకు సన్మానం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

SIR-2026 ప్రోగ్రామ్ లో భాగంగా బండారి లేఔట్ డివిజన్(275) నందు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన దీూా లను డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, SIR ప్రోగ్రామ్ ఇంచార్జ్ మిథున్ రెడ్డి దీూా లను ప్రత్యేకంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... సార్ ప్రోగ్రాం విజయవంతం చేసినందుకు ప్రజలకు బిఎల్ఓ లకు సమన్వయం పెరిగిందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం ఇచ్చిన కరెసి పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కోలన్ జీవన్ రెడ్డి, కోటపాటి మురళి, డీసీసీ జనరల్ సెక్రటరీ రావూరి మౌళేశ్వర్రావు, రాజిరెడ్డి, మహిళా నాయకురాలు ఇందిర, రఫియాబేగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

షాపూర్ డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ నెహ్రూనగర్, మార్కండేయ నగర్ మీదుగా ఘనంగా సాగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్క శంకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జేకే.శేఖర్ యాదవ్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈకార్యక్రమంలో ఓబీసీ సెక్రటరీ మసాని రమేష్, రఘుపతి, సిద్ధార్థ్, సాయి జీవంత్, తిరుపతి దాస్, కిరణ్, స్వాతి, సరోజిని, రాధిక, దీపక్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఐ లక్ష్యం

## కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ప్రచారజాత--సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

బొమ్మలరామారం, ఆగస్టు 13 (ప్రజా కలం)

ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరగాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి,ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.గురువారం రోజున కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి,వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలేరు నియోజకవర్గ స్థాయి ప్రచారజాతను బొమ్మలరామారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రచార జాతను సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆరోపించారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదన్నారు. నిరుద్యోగం, కార్మికుల సమస్యలు, రైతుల ఇబ్బందులు, పేదలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

బద్లావ్ జరూరి హై (మార్పు కావాలి) అనే నినాదంతో నిర్వహిస్తున్న దేశవ్యాప్త ప్రచార జాతను యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మాట్లాడుతూ 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడుతూ వారికి ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించి,వ్యవసాయ రంగాన్ని రక్షించాలని కోరారు.ధరల పెరుగుదలను అరికట్టాలని, పేదలు,కార్మికులు,రైతుల సమస్యలను పరిష్కరించాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సీపీఐ నిర్వహిస్తున్న ఈ ప్రచారజాను ప్రజలు ఆదరించాలని కోరారు.ఆలేరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఆగస్టు 6 ఉండి 14 తేదీల్లో ప్రచారజాత నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, దళిత కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్టల శంకర్, మండల కార్యదర్శి అన్నవైన వెంకటేశం,ఇనగందుల రాజప్ప,వడ్లకొండ భారతమ్మ, సంధ్య రాణి, చిట్టి,ఆనందం, మెట్ల బాబు,కూర నరేష్ తదితరులు పాల్గొన్నారు

# బునాదిగాని కాలువ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



బీబీనగర్ ఆగస్టు 13 ( ప్రజా కలం )

భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో, బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద బునాదిగాని కాలువ నీటిని గురువారం రోజు భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బునాదిగాని కాలువపై బాక్స్ కల్వర్టుల నిర్మాణం పూర్తికావడంతో కాలువలో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగి, నీటిని సాఫీగా తరలించేందుకు మార్గం సుగమమైంది అన్నారు. దీంతో కాలువ ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి విషయంలో మరింత ప్రయోజనం చేకూరనుంది.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునీకరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు.బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, కాలువ నీటిని విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.కాలువ ద్వారా విడుదల చేసిన నీరు చివరి ఆయకట్టు వరకు సక్రమంగా చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి ప్రవాహంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గ అభివృద్ధికి ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, కాలువల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో PACS చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు పంజాలరామాంజనేయులు, గోలి పింగల్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి,ూాజూ వైస్ చైర్మన్, PACS డైరెక్టర్లు, మండలనాయకులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు,EE శైలేందర్, ఐజు లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా TPCC ఎస్సీ సెల్ సెక్రటరీగా గొర్రె ప్రశాంత్ నియామకం

హనుమకొండ ఆగస్టు 13 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నియామకం జరిగింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలానికి చెందిన గొర్రె ప్రశాంత్‌ను వరంగల్ జిల్లా ూజజ ఎస్సీ సెల్ సెక్రటరీగా అలాగే వర్ధన్నపేట మండల ఇన్‌చార్జిగా నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా గొర్రె ప్రశాంత్ మాట్లాడుతూ...తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు జిల్లా అధ్యక్షులకు, పార్టీ నాయకులు కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ



బలోపేతానికి కృషి చేస్తానని వర్ధన్నపేట మండలంతో పాటు వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.




# సుదగాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐడెంటి కార్డుల పంపిణీ

మోటకొండూరు ఆగస్టు 13 (ప్రజా కలం)

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు సుదగాని ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సుదగాని పౌండేషన్ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్ అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, మోటకొండూర్ మండలం, చాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఐడెటింటి కార్డులు సుదగాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు ఈ సందర్భంగా హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో మెలిగి,శ్రద్ధతో చదువుకోని మంచి ఫలితాలు తీసుకారావాలి అని అన్నారు అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మంచి ర్యాంకులు సాధించేందుకు ప్రోత్సహిస్తుంది అని అన్నారు వారసత్వ సంపదతో కాకుండ సమాజంలో గౌరవం,హోద కేవలం చదువుకోవడం ద్వార వస్తుందిని ఆయన అన్నారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర బాలగంగాధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చాడ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ముదిరాజ్,ఉపసర్పంచ్ పెల్లిమెల్లి భూమయ్య గౌడ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు క్రిష్ణవేణి,పాఠశాల చైర్మన్ సి. హెచ్ మమత,రిటైర్డ్ టీచర్ జక్క యాదిరెడ్డి, నాయకులు పబ్బతి భూపాల్ రెడ్డి, అనంతుల వెంకట్ రెడ్డి , వారాల మురళిమోహన్ రెడ్డి, అనంతుల రాజీ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ ఆశయాల సాధనకు జనసేన కృషి

## -జనసేన పార్టీ గద్వాల ఇన్చార్జి బాసు చిన్న తిమ్మప్ప

గద్వాల ప్రతినిధి ఆగస్టు 13ప్రజా కలం




జనసేన పార్టీలో చేరి గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా గద్వాలకు విచ్చేసిన బాసు చిన్న తిమ్మప్పకు జనసేన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. గాంధీ చౌక్ నుంచి బైకులతో ర్యాలీ నిర్వహిస్తూ ఘనంగా స్వాగతం తెలిపారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి బాసు చిన్న తిమ్మప్ప పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్షయ్ బ్యాంక్ అవుట్ ఆల్ హాల్ లో విలేకరుల సమావేశం నిర్వహించి సందర్భంగా మాట్లాడుతూ... అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో మార్గదర్శకమని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, హక్కుల సాధన కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని బాసు చిన్న తిమ్మప్ప తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, అభిమానులు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వారి తరఫున నిరంతరం పోరాటం చేస్తామని, అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం, సమానత్వ మార్గంలో జనసేన పార్టీ ముందుకు సాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ రెడ్డి

వలిగొండ ఆగస్టు 13 ప్రజాకలం:మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ గా ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి భాధ్యతలు స్వీకరించారు.ఈయన నల్గొండ జిల్లా వాడపల్లి ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వలిగొండ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పనిచేసిన ఎస్ఐ యుగంధర్ గౌడ్,భువనగిరి ఎస్పీ ఆఫీస్ వీఆర్ కు బదిలీ చేశారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తామని,చట్టాన్ని ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.గంజాయి రవాణా అరికట్టేందుకు కృషి చేస్తానని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకుంటానని తెలిపారు.బదిలీపై వెళ్లిన ఎస్ఐ యుగంధర్ గౌడ్ కు పోలీస్ సిబ్బంది వీడ్కోలు పలికి, నూతన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు.



# మైసమ్మ గుడి స్థలానికే ఎసరు!

## కబ్జా కోరుల కన్ను దేవాలయ భూములపై!

- తిరుమల మేడోస్, సాయికృష్ణ లే అవుట్ స్థలంపై పక్కా స్కెచ్?
- బయటకు తెలిసింది 300 గజాలు..ఎసరు పెట్టింది 1000 గజాల స్థలానికి..
- పూజలు అందుకుంటున్న గుడి స్థలాన్ని అమ్మి సొమ్ము చేసుకునే యత్నాలు...
- కాలనీవాసుల ఫిర్యాదుతో బట్టబయలైన వ్యవహారం..
- అమ్మిన వారిపై కేసు.. కొనుగోలుదారులపై చర్యలేవని నిలదీత..
- పత్రాల్లో కొనుగోలుదారులు కాలనీవాసులే..
రాజకీయ ఒత్తిళ్లతో తప్పించారంటూ ఆరోపణలు..
- గుడి,పార్కు స్థలాన్ని కాపాడుకునే వరకు వెనక్కి తగ్గం : కాలనీవాసులు

ప్రజా కలం ప్రత్యేకం..





మేడ్చల్ జిల్లా ఆగస్ట్13(ప్రజాకలం న్యూస్)

కాలనీ లేఅవుట్‌లో గుడి,పార్కు కోసం కేటాయించిన స్థలంపై కొందరి కన్ను పడిందన్న ఆరోపణలు తిరుమల మేడోస్ కాలనీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఏళ్లుగా స్థానికులు పూజలు నిర్వహిస్తున్న మైసమ్మ గుడి ఉన్న స్థలంతో పాటు పార్కు కోసం కేటాయించిన భూమిపై విక్రయ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో కాలనీవాసులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

స్థలం విక్రయ వ్యవహారంపై కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించి విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినట్లు వారు చెబుతున్నారు. అయితే అదే సమయంలో కొనుగోలు చేసిన వ్యక్తులు కూడా తిరుమల మేడోస్ కాలనీకి చెందినవారే కావడం ఇప్పుడు ప్రధాన చర్చనీయంగా మారింది. లేఅవుట్ స్వరూపం,గుడి ఉనికి,పార్కు స్థలం వంటి విషయాలు తెలిసినప్పటికీ కొనుగోలు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఏళ్లుగా పూజలు.. మైసమ్మ గుడిగా గుర్తింపు**

తిరుమల మేడోస్ పరిధిలోని ఈ గుడిలో కొన్ని సంవత్సరాలుగా గ్రామస్థులు, స్థానికులు పూజలు నిర్వహిస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. స్థానికుల ఆచారాలు,పూజా కార్యక్రమాలతో కొనసాగుతున్న ఈ స్థలాన్ని మైసమ్మ గుడిగా గుర్తించి పూజలు నిర్వహిస్తున్నామని వారు చెప్పుతున్నారు. అలాంటి స్థలాన్ని వ్యక్తిగత క్రయవిక్రయాలకు గురిచేయడం ఎలా సాధ్యమైందని వారు ప్రశ్నిస్తున్నారు. గుడి ఉన్న విషయం తెలిసినప్పటికీ స్థలాన్ని కొనుగోలు చేయడానికి ఎవరైనా ముందుకు వచ్చారా? వారి వెనుక ఎవరున్నారు? అనే అంశాలపై దర్యాప్తు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**లేఅవుట్‌లో గుడి.. పార్కు అని స్పష్టంగా ఉన్నా!**

కాలనీ లేఅవుట్ పత్రాల్లో గుడి, పార్కు కోసం స్థల కేటాయింపులు ఉన్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. దీనికి సంబంధించిన పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అవసరమైన సమయంలో అధికారులకు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంటున్నారు.

ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని క్రయవిక్రయాలకు ఎలా అనుమతించారు? రిజిస్ట్రేషన్ జరిగితే ఏ పత్రాల ఆధారంగా జరిగింది? అనే ప్రశ్నలు ఇప్పుడు అధికారుల ముందున్నాయి.




**పక్కా పథకమా.......?**

గుడి,పార్కు స్థలం కావడంతో భవిష్యత్‌లో విలువ పెరుగుతుందని భావించి ముందస్తు ప్రణాళికతోనే స్థలాన్ని దక్కించుకునే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలు కాలనీలో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారిక దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. కాలనీవాసులు మాత్రం ఇది సాధారణ స్థల లావాదేవీ కాదని, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు మార్చే ప్రయత్నంగా భావిస్తున్నారు.

**కొనుగోలుదారులు కూడా కాలనీవాసులే!**

ఈ వ్యవహారంలో మరో కీలక అంశం కొనుగోలుదారులుగా ఉన్న వ్యక్తులు అదే కాలనీకి చెందినవారేనని స్థానికులు చెబుతుండటం, కాలనీలో ఏళ్లుగా ఉన్న గుడి,దాని వద్ద జరిగే పూజలు,లేఅవుట్‌లోని పార్కు స్థలం గురించి వారికి తెలియకుండా ఉండే అవకాశమే లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. తెలిసి కొనుగోలు చేశారా? తెలియక కొనుగోలు చేశారా? అనే విషయాన్ని అధికారులు పత్రాలు, సాక్ష్యాలు, లావాదేవీల ఆధారంగా నిర్ధారించాలని కోరుతున్నారు.

**బయటపడింది 300 గజాలు..**
**అసలు 1,000 గజాలా?**

300 గజాల వ్యవహారం బయటపడడంతో పెద్దల సమక్షంలో వాటిని రద్దు చేసుకుంటామని చెప్పినట్లు సమాచారం. అయితే మిగిలిన సుమారు 700 గజాలను బంధువుల పేర్లపైకి మార్చుకుని, తాము లక్షల్లో నష్టపోయామని చెబుతూ వ్యవహారాన్ని వదిలేయాలని పెద్దలను ఆశ్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**అమ్మిన వారిపై కేసు.. కొనుగోలుదారుల సంగతేంటి?**

కాలనీవాసుల ఫిర్యాదుతో విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినప్పటికీ, కొనుగోలుదారులపై సమాన స్థాయిలో విచారణ జరగకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒక లావాదేవీలో విక్రేత, కొనుగోలుదారు ఇద్దరి పాత్రను పరిశీలించాల్సి ఉంటుందని, కేవలం ఒక వర్గంపై చర్యలు తీసుకుని మరొక వర్గాన్ని వదిలేయడం వల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయని అంటున్నారు.

**రాజకీయ ఒత్తిళ్ల ఆరోపణలు....!!**

కొనుగోలుదారులపై చర్యలు తీసుకోకుండా వదిలేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వ్యవహారం బయటపడిన తర్వాత కొందరు రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి తమకు అనుకూలంగా చర్యలు తీసుకునేలా ప్రయత్నించారన్న విమర్శలు ఉన్నాయి. అయితే రాజకీయ నాయకుల ప్రమేయంపై వస్తున్న ఆరోపణలు నిజమా కాదా అన్నది కూడా దర్యాప్తులో తేలాల్సి ఉంది. అధికారులపై ఎవరైనా ఒత్తిడి తెచ్చారా? చర్యలు ఎందుకు ఒక దశలో ఆగిపోయాయి? అనే అంశాలపై ఉన్నతాధికారులు విచారణ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**గుడి,పార్కు స్థలం కాపాడేదెవరు?**

లేఅవుట్‌లో గుడి, పార్కు కోసం కేటాయించిన స్థలం వ్యక్తిగత వ్యక్తుల చేతుల్లోకి వెళ్లితే కాలనీ ప్రజల సామూహిక ప్రయోజనం దెబ్బతింటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా ఏళ్లుగా స్థానికులు పూజలు నిర్వహిస్తున్న మైసమ్మ గుడి స్థలానికి సంబంధించి ఎలాంటి వివాదాస్పద లావాదేవీలు జరగకుండా అధికారులు తక్షణమే రికార్డులను పరిశీలించి స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

**పత్రాలన్నీ బయటపెట్టాలి**

ఈ వ్యవహారానికి సంబంధించి తమ వద్ద ఉన్న లేఅవుట్ పత్రాలు, స్థల కేటాయింపు వివరాలు, విక్రయ--కొనుగోలు పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు తదితర ఆధారాలను అధికారుల ముందు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని కాలనీవాసులు చెబుతున్నారు. స్థలం ఎవరి పేరుపై ఉంది? లేఅవుట్‌లో దాని కేటాయింపు ఏమిటి? విక్రయానికి ఎవరు ప్రయత్నించారు? కొనుగోలుదారులు ఎవరు? మధ్యవర్తులెవరు? డబ్బు లావాదేవీలు ఎలా జరిగాయి? రిజిస్ట్రేషన్ జరిగిందా? వంటి ప్రతి అంశాన్ని దర్యాప్తులో పరిశీలించాలని కోరుతున్నారు.

**"ఎవరినీ వదిలే ప్రసక్తే లేదు"**

మైసమ్మ గుడి, పార్కు స్థలాన్ని కాపాడుకునే విషయంలో వెనక్కి తగ్గేది లేదని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. ఏళ్లుగా పూజలు జరుగుతున్న గుడి స్థలాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలను సహించబోమని అంటున్నారు.

"ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, కాలనీ సామూహిక అవసరాలకు సంబంధించిన స్థలాన్ని కాపాడుకోవడం మా బాధ్యత. ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఉన్నా.. ఆధారాలతో బయటపెడతాం. తప్పు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు" అని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

**ఉన్నతస్థాయి దర్యాప్తే పరిష్కారం**

ఈ వివాదాన్ని స్థానిక స్థాయిలోనే ముగించకుండా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

లేఅవుట్ రికార్డుల నుంచి మొదలుకొని రిజిస్ట్రేషన్ పత్రాలు, కొనుగోలు--విక్రయ లావాదేవీలు, కొనుగోలుదారుల పాత్ర, మధ్యవర్తుల వ్యవహారం, రాజకీయ జోక్యం, అధికారుల చర్యలు.. ఇలా ప్రతి కోణాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. మైసమ్మ గుడి, పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని పరిరక్షించడంతో పాటు.. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు వ్యక్తులు, లావాదేవీల పూర్తి వివరాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర దర్యాప్తు తప్పనిసరి అని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు.

ఎంతటి వారినైన వదిలిపెట్టొద్దు - మీసాల క్రిష్ణ బీఆర్ఎస్ ప్రదాన కార్యదర్శి : గుడి స్థలాన్ని కబ్జాచేయడం సిగ్గుచేటు,దేవుడి భూమినే కబ్జా చేస్తున్నారంటె ప్రజల స్థలాలకు రక్షణ లేకుండా పోతుంది.

గుడి,పార్కు స్థలాన్ని అమ్మిన వారిపై కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.








Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి

**- జర్నలిస్టులకు భద్రత, భరోసా టీయూడబ్ల్యూజే (ఐజేయు)తోనే సాధ్యం !**

**- జిల్లా అధ్యక్షుడు యాదగిరి ని అభినందించిన రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 13( ప్రజా కలం):

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ( టీయూడబ్ల్యూజే- ఐజేయు) ద్వారానే జర్నలిస్టుల కు భద్రత సాధ్యమని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తో ఇప్పటికే అనేక దఫాలుగా చర్చలు జరిగాయని, త్వరలో హెల్త్ కార్డు లు వస్తాయని తెలిపారు. సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ, పటాన్ చేరు నియోజకవర్గం నూతన కమిటీలు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాదులోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. గజమాలతో , శాలువా తో సత్కరించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా మహాసభను క్రమశిక్షణతో భారీ ఎత్తున నిర్వహించినందుకు జిల్లా కమిటీని అభినందించారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు బండారు యాదగిరికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా పటాన్చెరు నియోజకవర్గ కమిటీ ఏర్పాటుపై హర్షం వెలిబుచ్చారు. టి యు డబ్ల్యు జె-ఐ జె యు మొక్కుబడి యూనియన్ కాదు అని, 70 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సంఘం అని పేర్కొన్నారు. జర్నలిస్టుల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక సంఘం అని చెప్పారు. అక్రిడేషన్ కార్డులు ఇప్పటికే చాలా మందికి వచ్చాయని, మిగిలిన వారికి కూడా త్వరలో వస్తాయని చెప్పారు.అంతే కాకుండా అర్హులైన వారికి ఇంటి స్థలాలకు సంబంధించి త్వరలో ప్రభుత్వం ఒక పాలసీని తెస్తుందని తద్వారా అందరికీ ఇట్టి స్థలాలు వస్తాయని వివరించారు. పాత్రికేయులలో వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లా మహాసభను అందరి సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్క రిపోర్టర్ కూడా తమ సొంత ఫంక్షన్ లాగా భావించి జిల్లా మహాసభకు తరలివచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల సంక్షేమానికి పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తామని చెప్పారు.



పటాన్చెరు మాదిరిగానే జిల్లాలో ని మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతను సాధించడం ద్వారా హక్కులను పొందడమే తమ ముందున్న కర్తవ్యం అని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ సూచనలు సలహాలతో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ సంఘం తలపెట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని సూచించారు. సమన్వయం చేసుకోవడం ద్వారా సంఘం కార్యక్రమాలకు ఎక్కువ మంది హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర నాయకుడు బాసిత్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రతి విషయంలో టియుడబ్ల్యూజేఐజేయు అండగా నిలిచిందని అన్నారు. సంఘం పిలుపును పూచే తప్పకుండా పాటిస్తామని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం జిల్లా నాయకత్వం ఇచ్చిన కార్యక్రమాలను సమిష్టిగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమాల వల్ల ప్రతి జర్నలిస్టుకు ఉత్సాహం కలుగుతోందని చెప్పారు. చిన్న మధ్య తరహా పత్రికల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు కూడా పోరాట పటిమ ను సాధించాలంటే టీయూడబ్ల్యూజేఐజేయు చరిత్ర తెలుసుకుంటే సరిపోతుందన్నారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా టియుడబ్ల్యూజే పని చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గం అధ్యక్షుడు పత్తి నరసింహ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు గర్వపడే విధంగా పటాన్చెరు నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా పాలువురు జర్నలిస్టులు జిల్లా అధ్యక్షుడు యాదగిరికి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్,జిల్లా సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, , జిల్లా నాయకులు భూపాల్ రెడ్డి, హిమాయత్, పటాన్చెరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు...

# పోలీసుల పేరుతో సైబర్ మోసాలు



**- ఇద్దరు అంతర్‌జిల్లా నిందితుల అరెస్ట్**

వేములవాడ, ఆగస్టు 13 ( ప్రజా కలం ప్రతినిధి) : పోలీసులమంటూ అమాయకులను నమ్మించి ఆన్‌లైన్‌లో డబ్బులు కాజేస్తున్న ఇద్దరు అంతర్‌జిల్లా సైబర్ మోసగాళ్లను రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు, నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు మీడియా సమావేశంలో వెల్లడించారు,నిందితులపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 28కు పైగా కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వీరు ఇప్పటివరకు సుమారు రూ.15 లక్షల మేర మోసాలకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు,డీఎస్పీ వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్ అల్మాస్‌గూడలో నివాసముంటున్న కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన ప్రస్తుతం మీర్‌పేట్‌లో నివాసముంటున్న కట్కూరి శరత్ కుమార్ (31) గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల ఫోన్ నంబర్లను సేకరించేవారు. అనంతరం తమను తాము పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డిగా పరిచయం చేసుకొని, అత్యవసర వైద్య ఖర్చుల కోసం డబ్బులు అవసరమని చెప్పి బాధితులను నమ్మించేవారు, ముందుగానే ఓ పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్‌బండి మరమ్మతులకు వచ్చిందని చెప్పి వారి ఫోన్‌పే నంబర్ తీసుకునేవారు అదే నంబర్‌ను బాధితులకు ఇచ్చి డబ్బులు పంపించేవారు. డబ్బులు జమ అయిన తర్వాత పెట్రోల్ బంక్‌కు వెళ్లి నగదు తీసుకునేవారని పోలీసులు తెలిపారు,చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు కూడా ఇదే తరహాలో ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి హైదరాబాద్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ కుమారుడి కోసం అత్యవసరంగా రూ.70 వేల అవసరమని నమ్మించారు. నిందితులు ఇచ్చిన ఫోన్ నంబర్‌కు పెంటయ్య రూ.70 వేలు పంపించగా, అనంతరం వారు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు,కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్‌తో పాటు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులతో పాటు రూ.18 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

అభినందనలు.. చాకచక్యంగా దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిలను డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఆన్‌లైన్ లోన్ మోసాలు సైబర్ నేరాలు పై ఉద్యోగులకు అవగాహన

**- కందుకూరు ఎస్ హెచ్ ఓ హెచ్ వెంకటేశ్వర్లు**

కందుకూరు, ఆగస్టు 13,(ప్రజా కలం)

కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కందుకూరు సాగర్ హైవేపై ఉన్న లిపిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగులకు సైబర్ నేరాలు మాదకద్రవ్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హెచ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ సిబ్బందితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు.నకిలీ వీడియో కాల్స్ ద్వారా జరుగుతున్న మోసాలు,సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ నేరాలు డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలు, ఆన్‌లైన్ లోన్ మోసాలు ఉద్యోగులకు ప్రత్యేక హెచ్చరికలు అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దు,వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దు మాదకద్రవ్యాలపై అవగాహన,యువత




గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, అనర్థాల గురించి వివరణ మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. "ప్రజలు ఉద్యోగులు సైబర్ నేరాల పట్ల ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సైబర్ నేరం జరిగితే గోల్డెన్ టైం లోనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని" సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, హెడ్ కానిస్టేబుల్ రాజు, పెట్రోల్ మొబైల్ ఆఫీసర్ నరేష్ తో పాటు కంపెనీ సిబ్బంది సుమారు 200 మంది పాల్గొన్నారు.

# సీఎం సభను విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలి

**పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖు స్థాపన, ప్రారంభోత్సవాలు : కలెక్టర్ ప్రతీక్ జైన్**




సంగారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 13 ( ప్రజా కలం):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 15న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయ పరిసరాల్లో సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐఎస్డబ్ల్యూఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఈ నెల 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నందున, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సభకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, స్మార్ట్ రేషన్ కార్డుల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సభా ప్రాంగణంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, విద్యుత్, రాకపోకల మార్గాలు తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. శాఖల వారీగా అప్పగించిన విధులు, బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్‌తో పాటు సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్డబ్ల్యూ ఎస్పీ, డీఎస్పీ హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదిక, ముఖ్యమంత్రి ప్రయాణించే రూట్, రాకపోకల మార్గాలు, సభా ప్రాంగణం తదితర అంశాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి, పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- రూ.4.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు**

**- ప్రతి వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతాం**

**- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

వేములవాడ, ఆగస్టు 13 ( ప్రజా కలం ప్రతినిధి) : పట్టణంలో రూ.4.20 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో, పారదర్శకంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధికారులను ఆదేశించారు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనులతో ప్రజలకు శాశ్వత మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు,గురువారం పట్టణంలోని 12, 13, 15, 25వ వార్డుల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, అధికారులతో కలిసి చైర్మన్ పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా డ్రైనేజీ, రోడ్ల పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పలు వార్డుల్లో చాలాకాలంగా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. ఆయన కృషితో ప్రభుత్వం రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మౌలిక వసతుల కల్పనకు అత్యంత



ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీపడొద్దని కాంట్రాక్టర్లను ఆదేశించారు, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ అనన్య, టీవో అన్వేష్, కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, మూడపల్లి నీలమ్మ, మున్సిపల్ సిబ్బంది, నాయకులు, స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# చేయూత దరఖాస్తులు పకడ్బందీగా...

**ఈ నెల 31లోగా సమర్పించాలి - ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహించాలి**

**స్వీకరణ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్**




రాజన్న సిరిసిల్ల, ఆగస్టు (ప్రజా కలం ప్రతినిధి):

చేయూత పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు,జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. అర్హులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు, చేయూత పింఛన్లకు సంబంధించి ఏడు రకాల లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష నిర్వహించారు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

**పత్రాలపై అవగాహన కల్పించాలి...**

ప్రతి దరఖాస్తుకు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ జత చేయాలని కలెక్టర్ సూచించారు, వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు,ఒంటరి మహిళలకు గ్రామీణ ప్రాంతాల్లో 30, పట్టణ ప్రాంతాల్లో 35 ఏళ్ల వయసు నిబంధన ఉందని తెలిపారు.గీత కార్మికులకు 50 ఏళ్ల వయసు ఉండటంతోపాటు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, సంబంధిత సొసైటీలో సభ్యత్వం అవసరమని చెప్పారు. నేత కార్మికులు 50 ఏళ్ల వయసు కలిగి ఉండాలని, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ గుర్తింపు పత్రం సమర్పించాలని సూచించారు,ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ పత్రం, డయాలసిస్ బాధితులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలు జత చేయాలని తెలిపారు, దివ్యాంగులు సదరం ద్వారా మంజూరైన కనీసం 40 శాతం వైకల్య ధ్రువీకరణతో కూడిన యూడీఐడీ పత్రాన్ని సమర్పించాలని, చెవిటివారు 51 శాతం వైకల్య ధ్రువీకరణతో కూడిన యూడీఐడీ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులు కూడా యూడీఐడీ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**ప్రత్యేక సదరం శిబిరాలు...**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులు, తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితుల కోసం ప్రత్యేక సదరం వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులకు సదరం ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు, దరఖాస్తు ఫారాలను సక్రమంగా నింపడంతోపాటు అవసరమైన అన్ని పత్రాలను జత చేసి, ఆన్‌లైన్ ప్రక్రియను కూడా పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఫారాలు, పత్రాలపై ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజం, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేశ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డేపల్లిలో చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**- వడ్డేపల్లి సర్పంచ్ రాజాగారి రేణుక రాజాగౌడ్**



దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 13.రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు గ్రామ సర్పంచ్ రాజాగారి రేణుక రాజాగౌడ్ ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులందరూ ఏకరూప దుస్తులు ధరించడం ద్వారా సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు ఆరోగ్య పరిరక్షణ సేవలు అందుతున్నాయని తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ యాదమ్మ, ఆయా, చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ మండలం అంతారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

**– రాష్ట్ర రవాణా శాఖ పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతి పత్రం అందజేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహా**



మహేశ్వరం, ఆగస్టు 13,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం అంతారం గ్రామానికి ప్రభుత్వ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నందిగామ నర్సింహ మాట్లాడుతూ, షాబాద్ మండలం అంతారం గ్రామంతో పాటు చుట్టుపక్కల పలు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులు, రోగులు రోజువారీ ప్రయాణానికి చాలా ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సమస్యను సానుభూతితో విన్న మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. అంతారం గ్రామానికి వెంటనే బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మంత్రి ఇచ్చిన హామీపై హర్షం వ్యక్తం చేసిన నందిగామ నర్సింహ, మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంతారం గ్రామ వాసి గుండాల నర్సింహతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డేపల్లిలో విద్యుత్ సమస్యలపై ప్రజాబాట

**- విద్యుత్ ఏడి మధుసూదన్**



దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 13.విద్యుత్ వినియోగదారుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రజల వద్దకు వెళ్లి ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారని తుక్కాపూర్ ఏడి మధుసూదన్ తెలిపారు. గురువారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో అధికారులు పర్యటించి విద్యుత్ సరఫరా, స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గుర్తించిన చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్ద మొత్తంలో నిధులు అవసరమయ్యే సమస్యలను గుర్తించి, బడ్జెట్ కేటాయింపుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రతి మంగళవారం, బుధవారం అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ ఏఈఈ శ్రీనివాసరావు, సర్పంచ్ రాజాగారి రేణుక రాజాగౌడ్, ఉపసర్పంచ్ స్వామి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముత్తంగిలో మురుగు కష్టాలకు శాశ్వత చెక్!

**– మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

పటాన్‌చెరు, ఆగస్టు 13 (ప్రజా కలం) ప్రతినిధి ముత్తంగి డివిజన్,ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని సరిహద్దు కాలనీల మురుగు నీటి సమస్య కు శాశ్వత పరిష్కారం చూపేం దుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.గురువారం అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించి సమస్యను పరిశీలించారు.ప్రస్తుతం ఉన్న భూగర్భ మురుగు కాలువల పైపుల సామర్థ్యం తక్కువగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జనాభాకు అనుగుణంగా నూతన పైపులైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రెండు శాఖల అధికారులను ఆదేశించారు. త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్ రావు, డీఈలు కృష్ణవేణి, నరసింహ రావు, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, మేరాజ్ ఖాన్, నిజాముద్దీన్ బాబా, అబిద్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు..



# మహేశ్వరం గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలకు గుర్తింపు

**శానిటేషన్ సిబ్బందికి యూనిఫాం కాస్మోటిక్స్ పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ఉప సర్పంచ్ జోరాల రమేష్**



మహేశ్వరం, ఆగస్టు 13,(ప్రజా కలం)

మహేశ్వరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ ఉప సర్పంచ్ జోరాల రమేష్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది సేవలను స్మరించుకుంటూ, శానిటేషన్ సిబ్బందికి యూనిఫాంలు సబ్బులు, నూనెల వంటి కాస్మోటిక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునగపాటి నవీన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ఇతర ప్రజా సేవలను సిబ్బంది నిరంతరం కష్టపడి నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని, వారి కృషిని గుర్తించి ప్రోత్సహించడం గ్రామ పంచాయతీ బాధ్యత అని తెలిపారు. సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం మరియు ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఎండ, వర్షం చూడకుండా ప్రజల కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. ఈ రోజు అందిస్తున్న దుస్తులు, కాస్మోటిక్స్ పెద్ద బహుమతి కాకపోయినా, మీ సేవలను గుర్తించినందుకు ప్రతీకగా భావించాలని కోరారు. మనమందరం ఒక కుటుంబంలా కలిసి పనిచేస్తే మహేశ్వరం గ్రామాన్ని మరింత పరిశుభ్రంగా, సుందరంగా మరియు అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దగలమని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, మర్యాదగా స్పందించి, త్వరగా పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోరాల రమేష్, వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్న, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి సుజాత పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో 200 పడకలతో సమగ్ర వైద్య సేవలు

**- నర్సింగ్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నా మెరుగైన సేవలందిస్తున్నాం: సూపరింటెండెంట్ డా.రాజశేఖర్**



గజ్వేల్:13 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా–శిశు ఆసుపత్రుల ద్వారా మొత్తం 200 పడకల సామర్థ్యంతో గజ్వేల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు సమగ్ర ద్వితీయ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు,మౌలిక వసతులు,సిబ్బంది కొరత తదితర అంశాలను వివరించారు.

**12 విభాగాల్లో వైద్య సేవలు**

100 పడకల జిల్లా ఆసుపత్రిలో ప్రసూతి, స్త్రీ వైద్య శాస్త్రం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్,ఈ ఎన్ టి,నేత్ర వైద్యం,అనస్థీషియా,రేడియాలజీ, డెంటల్, పాథాలజీ తదితర విభాగాల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అత్యవసర వైద్య సేవలతో పాటు రక్త నిల్వ కేంద్రం, డయాలసిస్, పాలియేటివ్ కేర్, ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**మాతా–శిశు ఆసుపత్రిలో ప్రత్యేక సేవలు**

100 పడకల మాతా–శిశు ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతలు,నవజాత శిశువులు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు నవజాత శిశు సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

**ఆధునిక వైద్య సదుపాయాలు**

ఆసుపత్రిలో స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ ( ఎస్ ఎన్ సి యు), డెడికేటెడ్ పీడియాట్రిక్ కేర్ యూనిట్ (డీపీసీయూ), ప్రయోగశాల, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ఈసీజీ , రక్త నిల్వ కేంద్రం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రయోగశాలలో సుమారు 50 రకాల పరీక్షలు, టీ–హబ్ పరిధిలో మరో 50 నుంచి 55 రకాల పరీక్షలు నిర్వహించే సౌకర్యం ఉందన్నారు.ఫార్మసీ, ఇమ్యునైజేషన్ క్లినిక్లు, పాలియేటివ్ కేర్,డయాలసిస్, ఆరోగ్యశ్రీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు.

**ఐసీయూ లేకపోవడంతో సీరియస్ కేసులు రెఫర్**

జిల్లా ఆసుపత్రిలో ప్రస్తుతం ఐసీయూ విభాగం అందుబాటులో లేనందున అత్యంత తీవ్రమైన కేసులను మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నామని సూపరింటెండెంట్ తెలిపారు.అవసరమైన సందర్భాల్లో రోగుల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.

**13 మంది బదిలీ.. ఇద్దరే వచ్చారు**

ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నర్సింగ్ విభాగం నుంచి 13 మంది ఒకేసారి బదిలీ కాగా, కేవలం ఇద్దరు మాత్రమే కొత్తగా విధుల్లో చేరడంతో సిబ్బంది కొరత తీవ్రంగా ఏర్పడిందని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు.ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గజ్వేల్‌లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు,సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ సూచించారు.

# బీరంగూడ గుట్టలో శ్రావణ సందడి..

**– ప్రత్యేక పూజలు, హోమాలకు ఏర్పాట్లు..**



పటాన్‌చెరు, ఆగస్టు 13(ప్రజా కలం) ప్రతినిధి

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సిద్ధమైంది. ఆగస్టు 13 నుంచి సెప్టెంబర్ 11 వరకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు,హోమాలు,అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్, చైర్మన్ సుధాకర్ యాదవ్, దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి దేవనాదం తెలిపారు.ప్రతి మంగళ,శుక్రవారాల్లో ఉదయం 9 గంటలకు మహిళలతో సామూహిక కుంకుమార్చన,ప్రతి సోమవారం రుద్రహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా చండీ హోమం జరగనుంది.సెప్టెంబర్ 6న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, సాయంత్రం 6 గంటలకు పల్లకి సేవ నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 8న త్రయోదశి సందర్భంగా నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకం, సెప్టెంబర్ 10న మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆగస్టు 23, సెప్టెంబర్ 7న ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు,దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు పాల్గొన్నారు..

# సంగారెడ్డి లో మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

**– టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం**

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 13 ( ప్రజా కలం): ఈనెల 15 న సంగారెడ్డి పట్టణానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న విషయం తెలిసిందే. సంగారెడ్డి పట్టణం లోని ఐబీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ గార్ల విగ్రహాలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. గురువారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డిలు విగ్రహాలు నెలకొల్పిన స్థలాన్ని అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సీఎం చేతులమీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతున్న నేపథ్యం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, ఏర్పాట్లను అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ సమయం లో సీఎం తో పాటు ఎవరెవరు పాల్గొంటారో అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ జూలకంటి అంజనేయులు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నాయకులు రఘు గౌడ్,జార్జ్, కూన సంతోష్,కిరణ్ గౌడ్, మహేష్, శ్రీకాంత్, ప్రవీణ్ , సందీప్ రెడ్డి, మొగులయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.





## పెండింగ్ డీఏలు వెంటనే మంజూరు చేయాలి




దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 13.పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వెంటనే ప్రకటించాలని, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌పీసీ నాయకులు డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ పిలుపుమేరకు చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా రెండో దశలో వివిధ మండలాల తహసీల్దార్లకు మెమోరాండం సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో రాయపోల్ మండల తహసీల్దార్‌కు యూఎస్‌పీసీ తరపున మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాయపోల్ మండల శాఖ అధ్యక్షులు వై. గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కనకయ్య, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పి. శ్రీధర్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీకాంత్‌తో పాటు టీపీటీఎఫ్ నాయకులు టి. మెట్టురాం, ఎన్. సుగుణాకర్ రెడ్డి, ఎన్. నాగస్వామి, ఐ. మహేష్ గౌడ్, యూటీఎఫ్ నాయకులు అర్జున్, రాజు, నవీన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి అధికారం కాదు.. బాధ్యత..

**- జర్నలిస్టుల హక్కుల కోసం కృషి చేయాలి: విరహత్ అలీ..**



పటాన్‌చెరు, ఆగస్టు 13 (ప్రజా కలం) ప్రతినిధి

టీయూడబ్ల్యూజే, ఐజేయూ పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కార్యవర్గం జర్నలిస్టుల హక్కుల సాధనతో పాటు సంఘ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ సూచించారు. నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో విరహత్ అలీని కలిసి సన్మానించారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నరసింహ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన జర్నలిస్టుల సమావేశం విజయవంతమై రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిందని విరహత్ అలీ ప్రశంసించారు టీయూడబ్ల్యూజే, ఐజేయూకు 75 ఏళ్ల చరిత్ర ఉందని,పదవి అధికారం కాదని బాధ్యత మాత్రమేనని తెలిపారు. సేవాభావంతో పనిచేయాలని సూచించారు. త్వరలో పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రుమాండ్ల అనిల్, అబ్దుల్ బాసిత్, పర్చ శ్రీనాథ్, బసవేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, యాదగిరి, శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, పురుషోత్తం, శ్రీనివాస్, సిద్ధు పాల్గొన్నారు.

## దేశభక్తి,జాతీయ ఐక్యతను చాటుతూ ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర

గజ్వేల్:13 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి) గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నందన్ గౌడ్, బండారు మహేష్ పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. జాతీయ జెండాపై గౌరవం,ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావనను పెంపొందించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. త్రివర్ణ పతాకం భారతదేశ ఐక్యతకు,స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి,దేశ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు,సైనికులు, మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. దేశం పట్ల గౌరవం,జాతీయ ఐక్యత, దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా యాత్ర లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా,నియోజకవర్గ,మండల నాయకులతో పాటు పార్టీ కార్యకర్తలు,యువత,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేశారు.



### శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో

# కన్నుల పండువగా కళ్యాణోత్సవం

### - శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు..

### భక్తులతో కిటకిటలాడిన ఆలయం



గజ్వేల్:13 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)గజ్వేల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు,ఉదయ్ ఆచార్యులు మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో ప్రతిరోజూ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనాలనుకునే దంపతులు ఆలయ కమిటీని సంప్రదించాలని కోరారు.కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు టీఎండీ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు మాందాల తిరుపతిరెడ్డి,నాయకులు దేవులపల్లి రాజారాం,అయిత సత్యనారాయణ,గంగ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 13.చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన రాయపోల్ మండల



కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన చింతకింది యాదయ్య (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకుని, పక్కనే ఉన్న చిన్నమాసాన్‌పల్లి గ్రామ శివారులోని సింగనీ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటనతో రాయపోల్ మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య చింతకింది పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ కె. మానస తెలిపారు.

# ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్ : ఎల్బీ నగర్ ఏపీసీ కార్యాలయంలో ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున 2.30 గంటలకు ఘటన చోటు చేసుకుంది. మృతుడు ఎల్బీనగర్ పీఎస్కు చెందిన ఏ. సాయికుమార్ (13128).ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయం లోని రెస్ట్రూమ్లో ఉరివేసుకున్నట్లు గుర్తించారు. సాయికుమార్ 2024 బ్యాచ్లో ఎంపికయ్యాడు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఏసీపీ కార్యాలయానికి అటాచ్మెంట్ లో వున్నాడు. కర్మన్ఘాట్లో స్నేహితులతో కలిసి ఓ గదిలో నివాసం వున్నాడు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే కామినేని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గలకారణాలు తెలియాల్సి ఉంది. ఎల్బీనగర్పోలీస్ స్టేషన్ ముందు మృతుని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు.

## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

జంగారెడ్డిగూడెం : లక్కవరం సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే పై హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్ ఆగి ఉన్న ఆగి ఉన్న లారీ ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిని వారిని ఆసుపతరికి తరలించారు.

# రేషన్ బియ్యం కోసం రోజుల తరబడి తిప్పుతున్నారని ఆరోపణ

### తహసీల్దార్‌కు లబ్ధిదారుల ఫిర్యాదు

తాండూర్; తంగళ్లపల్లి గ్రామంలోని రేషన్ షాపు నంబర్-6 డీలర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ జ్యోత్స్నకు డీలర్‌పై ఫిర్యాదు చేశారు.డీలర్ లక్ష్మి షాపులో ఉండకుండా ఆమె భర్త రామలింగం బియ్యం పంపిణీతో పాటు షాపు వ్యవహారాలను అజమాయిషీ చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. రేషన్ షాపుకు వచ్చే లబ్ధిదారులను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రేషన్ బియ్యం తీసుకోకుండా తనకే విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నారని, అందుకు అంగీకరించని వారిని నాలుగైదు రోజులు షాపు చుట్టూ తిప్పిన తర్వాతే బియ్యం ఇస్తున్నారని ఆరోపించారు.ఇదేమిటని ప్రశ్నిస్తే మీ దిక్కున చెప్పుకోండి అంటూ బెదిరించడమే కాకుండా చులకనగా మాట్లాడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము నాలుగు రోజులుగా రేషన్ షాపుకు వెళ్తున్నప్పటికీ బియ్యం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు.తంగళ్లపల్లి రేషన్ షాపుతో పాటు తాండూర్ మండలంలోని అన్ని రేషన్ షాపులపై అధికారులు పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించాలని లబ్ధిదారులు కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న డీలర్లను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ పంపిణీ ప్రక్రియ, లబ్ధిదారులకు అందుతున్న సేవలను అధికారులు స్వయంగా పరిశీలిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.

## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలే లక్ష్యం

హైదరాబాద్ : జూబ్లీహిల్స్‌లోని స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథిగా, నటుడు డా. మాదాల రవి గౌరవ అతిథిగా, ప్రముఖ నటుడు సాయికుమార్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్ప్రింట్ డయాగ్నోస్టిక్స్ వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డ్ను ప్రారంభించారు. కుటుంబ ఆరోగ్య సంరక్షణను సులభతరం చేయడంతో పాటు, నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే దీని లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఆరోగ్య సంరక్షణలో నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలు కీలకమని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు.

# గజ్వేల్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ

### త్రివర్ణ పతాకాలతో కదిలిన బీజేపీ శ్రేణులు - దేశభక్తి నినాదాలతో మార్మోగిన పట్టణం

గజ్వేల్:13 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి):

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గజ్వేల్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు.ఇందిరా పార్క్ నుంచి బసవేశ్వర విగ్రహం వరకు భారీగా ర్యాలీ కొనసాగింది.త్రివర్ణ పతాకాలను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చేతబట్టి ముందుకు సాగుతున్న ప్రతి క్షణం స్వాతంత్ర్య సమరయోధులు,వీర జవాన్ల అపార త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. వారి ధైర్యం,అంకితభావం,దేశసేవ ఫలితంగానే నేడు గర్వించదగిన భారతదేశం మన ముందుందని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ నూతన ఆత్మవిశ్వాసంతో మరింత బలంగా ముందుకు సాగుతోందని తెలిపారు.వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం నిరంతరం పురోగమిస్తోందన్నారు. త్రివర్ణ పతాకాన్ని గర్వంతో,గౌరవంతో చేతబట్టడమే కాకుండా,దాని స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ హృదయాల్లో నిత్యం నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. మరింత శక్తివంతమైన,సుసంపన్నమైన, ఆత్మనిర్భర భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వికసిత్ భారత్



సాధనే సమష్టి సంకల్పం కావాలని నాయకులు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్, గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,బీజేపీ నాయకులు నందన్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్, రాంరెడ్డి,సంపత్ రెడ్డి, పోచయ్య, జానకిరామ్,ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కట్ట భాగ్యలక్ష్మి, జిల్లా కోశాధికారి శ్రీరామ్ శ్రీకాంత్, వెంకట్ రెడ్డి,నాయిని సందీప్,నరసింహ తదితర నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజ్ఞాపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు ఘన స్వాగతం

### - పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను బీజేపీ గుర్తిస్తుంది

### - బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు



గజ్వేల్:13 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మార్గమధ్యంలో ప్రజ్ఞాపూర్‌లో కొద్దిసేపు ఆగారు.ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు,తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు, ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రామచంద్రరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.కేంద్ర పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించి, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.బీజేపీ కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని రామచంద్రరావు తెలిపారు.పార్టీ సిద్ధాంతాలు,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్,నాలుగో వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్,బీజేపీ నాయకులు జిల్లా రమేష్,తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి,సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మారాటి కృష్ణమూర్తి,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు భూపతి తదితరులు పాల్గొన్నారు.అనంతరం రామచంద్రరావు నాయకులతో కొద్దిసేపు ముచ్చటించి స్థానిక పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు.టీ తాగిన అనంతరం నాయకులకు అభివాదం చేస్తూ హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.తమ ఆహ్వానాన్ని మన్నించి రాష్ట్ర అధ్యక్షులు ప్రజ్ఞాపూర్‌లో ఆగడంపై నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

# ఫ్రెషర్స్‌తో గీతం కళకళ..

### - గీతంలో ఫ్రెషర్స్ జోష్..అదిరిన స్వాగత వేడుకలు!..



పటాన్‌చెరు,ఆగస్టు 13 (ప్రజా కలం) ప్రతిని

నూతన విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వాగతం పలుకుతూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో ఘనంగా నూతన విద్యార్థుల స్వాగత వేడుక నిర్వహించారు. 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన విద్యార్థులను స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్,ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలు ఉత్సాహంగా ఆహ్వానించాయి.

**వేడుకల్లో ఉరకలెత్తిన ఉత్సాహం**

సంగీతం,నృత్యం, నాటికలు, వేదిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలతో విశ్వవిద్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆహార కేంద్రాలు,ఆటలు, ఛాయాచిత్ర వేదికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూతన విద్యార్థులు తమ ప్రతిభను చాటడంతో పాటు సీనియర్లతో, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మమేకమయ్యారు.విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడం, పరస్పర పరిచయాలను పెంపొందించడం, స్వీయ వ్యక్తీకరణకు అవకాశం కల్పించడం,చిరస్మరణీయ జ్ఞాపకాలను అందించడమే లక్ష్యంగా ఈ వేడుక నిర్వహించారు.తమ విశ్వవిద్యాలయ ప్రయాణానికి ఉత్సాహభరితమైన ఆరంభం కల్పించిన సీనియర్లకు నూతన విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఘనమైన వేడుకలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది..

### శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామిని దర్శించుకున్న

# చిన్నగోల్కొండ పిఏసిఎస్ చైర్మన్ బొమ్మ దౌర్ణకర్ గౌడ్



శంషాబాద్, ఆగస్టు 13, (ప్రజా కలం)

అమావాస్య సందర్భంగా శ్రీశైలం క్షేత్రంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారిని పలువురు భక్తులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా చిన్నగోల్కొండ పిఏసిఎస్ చైర్మన్ బొమ్మ దౌర్ణకర్ గౌడ్ డీసీసీబీ డైరెక్టర్ మంచర్ల మోహన్ రావు మాజీ వార్డు సభ్యులు బూరుగ ధనపాల్ రెడ్డి,నవారు మల్లారెడ్డి, సుక్కమెట్టు జగన్,మంచన్పల్లి సామ రవీందర్ రెడ్డి,బి. లక్ష్మారెడ్డి, నవారు రవికాంత్ రెడ్డి కావలి నరసింహ,మల్లేష్ తదితరులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు కోరారు.

### హర్ ఘర్ తిరంగా అభియాన్

# ప్రతి ఇంట దేశభక్తి పండుగ

### ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగరవేద్దాం

### మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్



కందుకూరు, ఆగస్టు 13, (ప్రజా కలం) ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగరవేద్దాం అని గుమ్మడి వెల్లి గ్రామ మాజీ సర్పంచ్ గౌర ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ ఐక్యతకు, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచే మహత్తర వేడుకలో మనమందరం భాగస్వాములం అవుదాం అని అన్నారు.ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగరవేద్దాం ప్రతి హృదయంలో దేశభక్తిని నింపుకుందాం ప్రతి వీధిలోలి తిరంగా పండుగ వాతావరణం సృష్టిద్దాం అని అన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోట్‌బుక్స్ పంపిణీ

### - విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం



గజ్వేల్:13 ఆగస్టు 2026 (ప్రజా కలం ప్రతినిధి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని కళాశాల ప్రిన్సిపల్ డా.సి.హెచ్. జ్యోతిర్మయి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఉపయోగకరమైన నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకుని చదువులో మరింత రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీలో ఈగల్ టీం దాడులు

### 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్

హైదరాబాద్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో తెలంగాణ ఈగల్ టీమ్ మరియు సైబరాబాద్ పోలీసులు ఆకస్మిక దాడులు చేసారు. యూనివర్సిటీ పరిధిలో డ్రగ్స్ విక్రయాలు, వాడకం జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్లో ఈగల్ టీమ్ తనిఖీలు చేపట్టింది. 17 మందికి పాజిటివ్ అనుమానం ఉన్న విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయింది. ప్రధాన నిందితుడి అరెస్ట్ విద్యార్థులకు అక్రమంగా మత్తుపదార్థాలు సరఫరా చేస్తున్న ఒక ప్రధాన డ్రగ్ పెడ్లర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు అస్సాం రాష్ట్రం నుండి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది క్యాంపస్లో ఒక్కో గ్రాము గంజాయిని సుమారు 500 రూపాయ లకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం యూనివర్సిటీ ప్రాంగణంలో ఈగల్ టీమ్ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని పూర్తి వివరాలు, నిందితుల సమాచారం పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా వెలువడాల్సి ఉంది.

### 4వ సారి కూడా ఆడపిల్ల పుట్టిందని

# ఆత్మహత్య చేసుకున్న బాలింత

నల్గొండ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విషాదం మునుగోడు మండలం చీకటి మామిడి గ్రామానికి చెందిన బాలింత మమత ఆసుపత్రి ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. వారం రోజుల క్రితమే ఆమెకు ప్రసవం జరగగా వరుసగా మళ్ళీ ఆడపిల్లలు పుట్టడంతో కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయని బంధువులు తెలిపారు. అత్తింటి వేధింపులే మమత మృతికి కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని

# 41వ వార్డులో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

బద్వేలు : కడప జిల్లా ప్రొద్దుటూరు 41వ వార్డు ప్రాంతానికి చెందిన వెంకట సుబ్బయ్య తన కుటుంబ సభ్యులు ఇతరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి, ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా విజయజ్యోతి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పేదలు, సామాన్య ప్రజల పార్టీ అని, రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా, వైఎస్ షర్మిలా రెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఇర్ఫాన్ బాషాను సంప్రదించాలని, ఆయన ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా చేనేత వర్గానికి చెందిన వారు సంక్షేమ పథకాలు అందడం లేదని విన్నవించగా, సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారానికి ఇర్ఫాన్ బాషా కృషి చేస్తారని విజయజ్యోతి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొసంగి సుబ్బారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ అబ్బాస్ , బద్వేల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లురు భాష,మైనారిటీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ గౌస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరాటేతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

నారాయణపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్లో కూడా రాణించాలని, కరాటే సాధనతో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గా అన్నారు.

ఆగస్టు 9న హైదరాబాద్ చంపాపేట్లో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు, 1 కాంస్య పతకం సాధించి నారాయణపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాలు, మెడల్స్ అందించి సన్మానించారు.